RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త


తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 6 శుక్రవారం 31 జనవరి 2025 పేజీలు : 4

## కుంభమేళాకు ఇప్పటివరకు ఎంతంటే..

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాజోరుగా కొనసాగుతోంది. అక్కడి ఘాట్‌లు అన్ని భక్తులతో సంతృప్తిగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులు ఊహించని స్థాయిలో వస్తున్నారు.
జనవరి 29 నాటికి మొత్తం 27.58 కోట్ల మంది భక్తులు కుంభమేళా స్నానాల్లో పాల్గొన్నారు. జనవరి 29న ఒక్కరోజే 7.5 కోట్ల మందికిపైగా భక్తులు ఘాట్‌లపై హాజరయ్యారు. ఈ సంఖ్య కుంభమేళా చరిత్రలోనే సరికొత్త రికార్డ్ అని అధికారులు తెలిపారు. జనవరి 28 నాటికి ఈ సంఖ్య 19.94 కోట్లుగా ఉంది.
**ఆధ్యాత్మిక యాత్రగా..** ఈ జాతరకు రావడానికి భక్తులు విదేశాలతోపాటు అనేక ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 10 లక్షల మంది కుంభమేళా కాలంలో కల్పవాసిగా ఉన్నారు.
అంటే వారు పలు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలను, పూజలను నిర్వహిస్తూ అక్కడే నివసిస్తున్నారు.




# పద్దులో ఉద్యోగులకు తీపి కబురు!

## ఐటీ శ్లాబుల్లో కీలక మార్పులు!?

ముఖ్యంగా ఇన్‌కమ్ ట్యాక్స్ విషయంలో చాలా ఆశలుంటాయి. ఈసారి శ్లాబ్‌లలో ఏమైనా మార్పు తీసుకొస్తారా..? ఇంకేదైనా తాయిలం ఇస్తారా అని ఎదురు చూస్తుంటారు. అయితేకొన్ని సోర్సెస్ ఆధారంగా తెలుస్తున్న సమాచారం ప్రకారం..ఈ సారి పద్దులో ఉద్యోగులకు తీపి కబురు చెప్పనుంది. ముఖ్యంగా ఐటీ శ్లాబ్‌లలో కీలక మార్పులు తీసుకొచ్చే అవకాశముందని ప్రచారం గట్టిగానే జరుగుతోంది. అదేంటంటే 10 లక్షల ఆదాయం వరకూ ప్రభుత్వం ఎలాంటి పన్ను విధించకూడదనే ఆలోచన చేస్తోంది. అయితే..ఇందుకు బదులుగా 25% అనే కొత్త శ్లాబ్‌ని తీసుకు రానుందనీ సమాచారం. 15 లక్షల నుంచి 20 లక్షల ఆదాయం ఉన్న వాళ్లు ఈ 25% శ్లాబ్ పరిధిలోకి వస్తారనీ అంటున్నారు. ఇందులో నిజమెంత అన్నది తెలియకపోయినా ఇప్పటికైతే అంతా ఇది..నిజమైతే బాగుండు అని కోరుకుంటున్నారు. ఇక మరో ప్రచారం ఏంటంటే....ప్రభుత్వం రెండు ఆప్షన్స్ పెట్టుకుందట. 10 లక్షల ఆదాయం ఉన్న వాళ్లపై పన్ను విధించకపోవడం ఒకటైతే..కొత్తగా 25% శ్లాబ్ తీసుకురావడం మరోటి. ప్రస్తుతమున్న శ్లాబ్‌ల ఆధారంగా చూస్తే ఏడాదికి 15 లక్షల రూపాయల ఆదాయం దాటిన వాళ్లను 30% శ్లాబ్‌లో చేర్చింది ప్రభుత్వం. అయితే..ఇలా మార్పులు చేయడం వల్ల దాదాపు లక్ష కోట్ల వరకూ ప్రభుత్వానికి నష్టం వాటిల్లే అవకాశముంది. అయినా ప్రభుత్వం ఉద్యోగులకు ఊరటనిచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోందని తెలుస్తోంది. ప్రస్తుతానికి జీడీపీ వృద్ధి రేటు కాస్త మందగించింది. ద్రవ్యోల్బణమూ ఇంకా దారిలోకి రావాల్సి ఉంది. ఇలాంటి సమయంలో ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలంటే ఇలాంటి నిర్ణయం తీసుకోక తప్పదని కేంద్రం భావిస్తోందని చెబుతున్నాయి విశ్వసనీయ వర్గాలు.




## మొత్తం 2 లక్షలకు పైగా దరఖాస్తులు
## ఇప్పటికే 18 వేల మందికి నగదు జమ

హైదరాబాద్ : వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' స్కీమ్ కు అర్హుల ఎంపిక ఫిబ్రవరి 2లోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 20 రోజులు పని దినాలు పూర్తి చేసిన వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తున్నారు. జిల్లాల వారీగా అర్హుల ఎంపికలో డీఆర్డీవో అధికారులు నిమగ్నమయ్యారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజులపాటు గ్రామ సభలు నిర్వహించగా.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 2 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నుంచి అర్హులను గుర్తించి, వచ్చే నెల 2లోగా ఆన్?లైన్?లో నమోదు చేయనున్నారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అర్హుల వివరాలు ఆన్ లైన్ లో ఎంటర్?చేయాలని.. ఆ తర్వాత ఇందులో ఎలాంటి మార్పుచేర్పులకు అనుమతించమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఈ పథకం కింద ఇప్పటికే 18,180 మంది అర్హులను గుర్తించారు. వీరికి తొలి విడత కింద రూ. 6 వేల చొప్పున మొత్తం రూ. 10.90 కోట్లకు పైగా ప్రభుత్వం జమ చేసింది.



## సూర్యాపేట జిల్లాలో రాహుల్ పర్యటన


జాతీయ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఫిబ్రవరి రెండవ వారంలో సూర్యాపేట జిల్లాలో పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ వెల్లడించారు. గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అధిక సీట్లు గెలిచి మేయర్ పదవి తిరిగి కాంగ్రెస్ దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రజలకు సమానత్వం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు చేరవేస్తున్నామని అన్నారు. ఫిబ్రవరి 5న కుల గణన నివేదిక క్యాబినెట్ సబ్ కమిటీకి అందజేయనున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్‌లో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అంతేగాక, కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని, టీఆర్‌ఎస్ హయాంలో కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని గమనించాలని రియల్టర్లకు సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లను అధిష్టానానికి నివేదించినట్లు మహేష్ గౌడ్ తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ పర్యటనను పురస్కరించుకుని సూర్యాపేటలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి, స్థానిక సమస్యలను హైలైట్ చేయాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. రైతులకు రుణ మాఫీ అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, బీఆర్‌ఎస్ అనవసరమైన ఆరోపణలు చేస్తోందని మహేష్ గౌడ్ అన్నారు.




హైదరాబాద్: పీజీ మెడికల్ సీట్లలో 50శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించేలా ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 2025 నాటికి తెలంగాణలో ఉన్న 2,924 పీజీ సీట్లలో 50 శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం 1,462 సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు వచ్చేవని, తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ 1,462 సీట్లు కూడా ఆల్ ఇండియా కోటాలోకి వెళ్లిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉంటూ మెడికల్ పీజీ చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది శరాఘాతంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఏపీ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కోబోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కూడా దెబ్బతినే అవకాశం ఉందని, పీజీలో ఇన్ సర్వీస్ కోటా అనేది ప్రశ్నార్థకం అవుతుందన్నారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కాన్‌స్టిట్యూషనల్ బెంచ్‌కు వెళ్లాలని, తీర్పుపై స్టే తీసుకురావాలని భారాస పక్షాన డిమాండ్ చేశారు. పీజీ మెడికల్ సీట్లలో స్థానిక రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు చొరవ తీసుకోవాలన్నారు. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి రాజ్యాంగ సవరణకు పట్టుబట్టాలని విజ్ఞప్తి చేశారు.

# హోరాహోరీ పోరు

## మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కీలక అభ్యర్థులు




## ఆశావహులు వీరే!!

హైదరాబాద్ : మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో తలపడేందుకు తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సిద్ధమయ్యాయి. ఈ ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న విడుదల అవుతుంది. ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేస్తారు. తెలంగాణలోని నల్గొండ-వరంగల్-ఖమ్మం జిల్లాలు, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక జరుగుతుంది. వీటితో పాటు మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ, విపక్షంలోని బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. బలమైన అభ్యర్థులు, పదునైన రాజకీయ వ్యూహాలతో ఎన్నికల బరిలోకి దూకేందుకు సన్నద్ధం అవుతున్నాయి.

**కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డికి తీవ్ర పోటీ...** ఎలాగైనా ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలను చేజిక్కించుకోవాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. బలమైన అభ్యర్థులను బరిలోకి దింపి మూడు ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కేలా చేయాలని ఆయన యోచిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తును మొదలుపెట్టింది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్- కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ప్రస్తుతం కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఉన్నారు. ఆయనకే మరోసారి పోటీ చేసే అవకాశమివ్వాలని కోరుతూ కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలంగాణ పీసీసీ సిఫారసు చేసింది. ఎందుకంటే గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉంది. అయినా జీవన్‌రెడ్డి గట్టిగా పోరాడి గెలిచారు. ఈ స్థానాన్ని ఆశిస్తున్న వారిలో విద్యాసంస్థల అధినేత ముస్కు రమణారెడ్డి, వెలిచాల రాజేందర్, నరేందర్‌రెడ్డి , ప్రసన్న హరికృష్ణ కూడా ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో తమ అభ్యర్థులకు మద్దతివ్వాలని కాంగ్రెస్ నేతలను వామపక్షాలు కోరుతున్నాయి. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన గోదావరి అంజిరెడ్డిని ప్రకటించారు.

**వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానంలో..** ప్రస్తుతం వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉన్నారు. ఈయన టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. ఈ స్థానంలో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) బలపరిచిన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ బరిలో నిలిచారు. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా వరంగల్ జిల్లాకు చెందిన సరోత్తంరెడ్డి పోటీచేస్తున్నారు. సీపీఎస్ సంఘం అభ్యర్థిగా డాక్టర్ కొల్లిపాక వెంకటస్వామి, పీఆర్‌టీయూ తెలంగాణ నుంచి హర్షవర్ధన్‌రెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

**మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ స్థానంలో..** మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రస్తుతం పీఆర్‌టీయూటీఎస్ నేత కూర రఘోత్తమ్‌రెడ్డి ఉన్నారు. అయితే ఈసారి పీఆర్‌టీయూటీఎస్ తమ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డిని ప్రకటించింది. విద్యాసంస్థల అధినేత మల్క కొమరయ్యను తమ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. ఈ స్థానం పరిధిలో బీజేపీకి ముగ్గురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో ఇక్కడ బీజేపీ అభ్యర్థి ప్రభావం ఎక్కువగా ఉండొచ్చు. టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా వై. అశోక్‌కుమార్ పేరు ఖరారైంది. సీపీఎస్ సంఘం నుంచి ఇన్నారెడ్డి పోటీ చేస్తున్నారు. ఎస్‌టీయూటీఎస్ నుంచి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

**పోటీకి దూరంగా బీఆర్‌ఎస్ ?...** ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలా ? వద్దా ? అనే దానిపై బీఆర్‌ఎస్‌లో తర్జనభర్జన జరుగుతోందని తెలుస్తోంది. బీఆర్‌ఎస్ నుంచి కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ను ఆశిస్తూ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. 2018లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ పోటీ చేయలేదు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన రవీందర్ సింగ్‌కు మద్దతు ఇచ్చింది. ఇక ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు కోసం దాదాపు 25 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయనున్నారు. పార్టీ గుర్తులతో కాకుండా అభ్యర్థుల పేర్లతో పోలింగు జరుగుతుంది. అందుకే ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

# సంపాదకీయం

## మోడీ కంటే కాంగ్రెస్ నే టార్గెట్ చేస్తున్న మమత

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి కొలువు తీరి ఎనిమిది నెలలు అవుతోంది. 2024 ఎన్నికలు నిజంగా దేశంలో కాక పుట్టించేలా సాగాయి. వరసగా రెండు సార్లు గెలిచిన మోడీ ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత ఇండియా కూటమికి ప్లస్ అవుతుందని అంతా భావించారు. పైపెచ్చు ఉత్తర భారతం బెల్ట్ లో బీజేపీ బలహీనపడడం కలసి వస్తుందని అంచనా కట్టారు. కానీ ఫలితాలు వేరేలా వచ్చాయి. బీజేపీకి సొంతంగా మెజారిటీ దక్కలేదు కానీ ఎన్డీయే మిత్రులతో కలసి ప్రభుత్వాన్ని మోడీ ఏర్పాటు చేసారు. చాకచక్యంగా ప్రభుత్వాన్ని నడుపుకుని వస్తున్నారు. ఈ నేపథ్యంలో వరసగా పశ్చిమ బెంగాల్ లో మూడు సార్లు గెలిచి తిరుగు లేని రాజకీయ ఆధిపత్యాన్ని చలాయిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికల మీద తనదైన విశ్లేషణ చేస్తూ మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ పుస్తకాలలో ఆమె నేరుగా కాంగ్రెస్ నే టార్గెట్ చేశారు మోడీ విజయాల వెనక కాంగ్రెస్ ఉందని ఆమె సంచలన ఆరోపణలే చేశారు. ఇండియా కూటమి సమర్ధంగా ఐక్యంగా 2024 ఎన్నికల్లోఎన్డీయేని ఎదుర్కోలేకపోయిందని అన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల వల్లనే ఇండియా కూటమి ఓడి నరేంద్ర మోడీ అధికారంలోకి రాగలిగారు అని ఆమె ఆక్షేపించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్టీలు అన్నీ కలిసినా ప్రయోజనం లేకపోయిందని ఒకరి మీద ఒకరు పోటీ చేసి బీజేపీకి ఎంతో మేలు చేశారని ఆమె విమర్శించారు. ఈ రకమైన చర్యలు అన్నీ బీజేపీకి ఎంతో బాగా కలసి వచ్చాయని ఆమె అన్నారు. ఇక పోతే ఇండియా కూటమికి కనీస ఉమ్మడి కార్యక్రమం అమలు చేసే పరిస్థితి కానీ ఉమ్మడి మేనిఫేస్టోని కార్యరూపం దాల్చేలా చేసే ప్రయత్నం కానీ లేదని మమతా బెనర్జీ గట్టిగా ఏకి పారేశారు. ఇలా బీజేపీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అతి ముఖ్య పాత్ర పోషించింది అని ఆమె ఆరోపించారు. ఇక చూస్తే కనుక మమతా బెనర్జీ చాలా కాలంగా కాంగ్రెస్ మీద తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తూ ఒంటెద్దు పోకడలు పోతోంది అన్నది మమతా బెనర్జీ ఆరోపణగా ఉంది. కాంగ్రెస్ పార్టీ కూటమిలోని ఇతర పార్టీలను గౌరవించడం లేదని ఆమె అంటున్నారు. ఇంకో వైపు చూస్తే ఇండియా కూటమిని సారధ్యం వహించాలని మమతా బెనర్జీకి ఉందని అంటున్నారు. అయితే ఆమెకు ఆ అవకాశాన్ని ఇవ్వకుండా కాంగ్రెస్ తానే కీలక పాత్రలో ఉంటోంది అన్న ఆగ్రహం ఆమెకు ఉంది. బీజేపీని కట్టడి చేయాలీ అంటే దూకుడు రాజకీయం అవసరమని మమత భావిస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ కూడా ఇండియా కూటమిలోని ఇతర పార్టీలను గౌరవిస్తూ వారి రాజకీయ అవకాశాలను పెంచేలా చూడాలని అవసరమైన చోట తాను ఎన్నికల పోటీ నుంచి తప్పుకోవాలని కూడా మమతా బెనర్జీ వంటి వారు సూచిస్తున్నారు. అయితే జరుగుతున్నది వేరేగా ఉంది. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆప్ కి వ్యతిరేకంగా కాంగ్రెస్ బరిలోకి దిగడాన్ని మమతా బెనర్జీతో సహా ఇండియా కూటమి పార్టీలు అన్నీ తప్పు పడుతున్నాయి. అదే విధంగా చూస్తే కాంగ్రెస్ ని ఒంటరిని చేసి ఇండియా కూటమి పార్టీలు ఆప్ కే మద్దతుని ప్రకటించాయి. ఈ పరిణామం ఇండియా కూటమి బలహీనతలను చాటి చెబుతోంది. దానికి తోడు అన్నట్లుగా మమతా బెనర్జీ తాజాగా చేసిన ఈ కీలక వ్యాఖ్యలు ఇపుడు ఇండియా కూటమిలో అగ్గి రాజేసేలా ఉన్నాయని అంటున్నారు. బీజేపీని కాంగ్రెస్ గెలిపిస్తోంది అన్న మమతా బెనర్జీ చేసిన ఆరోపణల మీద కాంగ్రెస్ నేతలు ఏ విధంగా రెస్పాండ్ అవుతారు అన్నది చూడాల్సి ఉంది.

## స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, పురోగతిపై అలియాబాద్ సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో సమావేశం....



గరుడ వార్త (శామీర్పేట) : స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, పురోగతిపై సెంట్రల్ బ్యాంక్ అలియాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా డి ఆర్ డి ఏ సహకారంతో గురువారం అలియాబాద్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ లాల్ సింగ్ ఆధ్వర్యంలో అలియాబాద్ గ్రామ పంచాయతీలో స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ఆర్బిఐ ఏ ఆర్ జి ఎం లక్ష్మీ శ్రావ్య, ఎల్ డి ఎం సి శివ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని వి ఓ ఏలు, సి సి, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లతో పాటు 30 స్వయం సహాయక సంఘాల నుండి దాదాపు 80 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్బిఐ ఏజీఎం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సమూహాల నిర్వహణ మరియు పురోగతి గురించి చర్చించారు. గ్రామ పంచాయతీలోని అన్ని స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి చేయడానికి సభ్యులకు అవసరమైన శిక్షణతో పాటు స్వయం సహాయక సంఘాల అనుసంధానాలు, క్రమం తప్పకుండా స్వయం సహాయక సంఘాల సమావేశాలను అమలు చేయడం గురించి ఎల్ డి ఎం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివరించారు. ఈ సమావేశం లో పి ఎం జె జె బి వై, పి ఎం ఎస్ బి వై, సుకన్య సమృద్ధి యోజన, విద్యా రుణాలు మొదలైన వాటిపై ప్రయోజనాలను మరియు సైబర్ నేరాల నుండి రక్షణ పై ఎల్ డి ఎం కష్టంగా వివరించారు.

ఈ సమావేశంలో APM సురేష్ రెడ్డి, మండల సమైక్య కార్యదర్శి జ్యోతి, గ్రామ సంఘం ఓబీలు, వి ఏ ఓ లైన సోనీ, మాధవి, షాహిద్ జోష్న తోపాటుగా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గీతా వృత్తి దారులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి...



శామీర్ పేట, (గరుడ వార్త) : మీలాంటి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం గీతా వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గీతా పనివారాల సంఘం ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. గురువారం శామీర్ పేట మండలం మజీద్ పూర్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గీత పని వారల సంఘం నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు.


ఈ సందర్భంగా డిజి సాయిల్ గౌడ్ మాట్లాడుతూ కీర్తిశేషులు మాజీ ఎం.పీ.కామ్రేడ్ ధర్మభిక్షం 1957లో సంఘాన్ని స్థాపించి 68 సంవత్సరాలు అయిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు గీత కార్మికులకు పెన్షన్లు, వనం పెంపకానికి జీ.వో.560 ప్రకారం సొసైటీల నిర్మాణానికి, తదితర సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తూ సాధించుకున్నామని తెలిపారు.ప్రస్తుతం ఎక్స్గ్రేషియా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలు ఇవ్వాలని, వనం పెంపకం గురించి ప్రతి సొసైటీకి ప్రభుత్వం 10 ఎకరాలు భూమి కేటాయించాలని కోరారు. వృద్ధాప్య పెన్షన్ వృత్తి పెన్షన్ గా రూ. 5 వేలు ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్గ్రేషియో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గీతా వృత్తిని గుర్తించి యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, సొసైటీ సభ్యులకు గుర్తింపు కార్డులు, ప్రభుత్వం జారీ చేయాలని, ఎక్సైజ్ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ కమిషనర్ కమిషనర్లకు, రాష్ట్ర సంఘం పక్షాన మెమోరాండం ఇవ్వడం జరిగిందని చెప్పారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె సీతారాములుగౌడ్, అబ్బగోని భాస్కర్ గౌడ్, గీత పనివారాల సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి.నరేంద్ర ప్రసాద్, దళిత సేన రాష్ట్ర నాయకుడు తుంకి మల్లేష్, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, వివిధ గ్రామాల నాయకులు శ్రీశైలం, గున్నాల నరసింహ, తప్పెట్ల రాములు, నక్క సత్యనారాయణ గౌడ్, ఏ వెంకటేష్ గౌడ్, జి. నర్సింగరావు, జగదీష్ గౌడ్, టీ.జగదీశ్వర్ గౌడ్, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అష్ట బంధన సంప్రోక్షణ మహాకుంభాభిషేకం మహోత్సవం...

**ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి మూడవ తేదీ వరకు తేదీ వరకు కొనసాగనున్న భగవత్ కార్యక్రమాలు...**

**సత్య సాధన ఫౌండేషన్ విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్స్, నాగారం, కీసర మండలం....**





గరుడ వార్త (హైదరాబాద్) : అష్ట బంధన సంప్రోక్షణ కుంభాభిషేకం మహోత్సవాన్ని శ్రీ భగవాన్ శ్రీ శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య మంగళ శాసనములతో శ్రీ భూ సహిత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి శ్రీ పంచాయతన సహిత సోమ స్కంద రామలింగేశ్వర స్వామి వార్ల ఆలయంలో నిర్వహిస్తున్నారు. డాక్టర్ కే సత్యనారాయణ డాక్టర్ కే విజయలక్ష్మి డాక్టర్ నరసింహారావు కెపి అనుపమ తదితరులు కలిసి భక్తిశ్రద్ధలతో అష్ట బంధన సంప్రోక్షణ కుంభాభిషేకం మహోత్సవాన్ని శ్రీ భగవాన్ శ్రీ శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య మంగళ శాసనములతో నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవం ఈ శనివారం నుండి ఫిబ్రవరి మూడో తారీకు సోమవారం వరకు కొనసాగుతుందని వారు తెలియజేశారు. మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని పునీతులు కావాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

## ఓ గృహిణి మధ్యాహ్నం భోజనానికి వస్తున్నావు అంటూ భర్తకు ఫోన్ చేసి.... అంతలోనే ఉరి వేసుకుని అనంత లోకాలకు...

**అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న శామీర్పేట పోలీసులు ...**

శామీర్ పేట, (గరుడ వార్త) : ఓ గృహిణి మధ్యాహ్నం భోజనానికి వస్తున్నావా అంటూ భర్తకు ఫోన్ చేసి అంతలోనే చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన భీమిరెడ్డి పావని(25) గృహని గురువారం మధ్యాహ్నం ఉరివేసుకొని మృతి చెందిందని సమాచారము అందడంతో హుటాహుటిన శామీర్పేట పోలీసులు,



ఎస్సై హారిక సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించగా, పావని గదిలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని, సదరు గృహినికి భీమిరెడ్డి నాగిరెడ్డి అలియాస్ వాసు తో గత 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందన్నారు. వీరికి ఒక కూతురు, కొడుకు ఉన్నారు. వీరిది పెద్దలు కుదిరిచిన వివాహము. డైరీలో రాసిన సూసైడ్ నోట్ లో పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమని రాసినట్లుగా సమాచారం. కాగా ఆర్థిక ఇబ్బందులు వల్ల లేక మరే ఇతర కారణాలవల్ల మృతి చెందిందా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువులో ఓ వృద్ధుడి మృతదేహం లభ్యం...



శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట పెద్ద చెరువులో ఓ వృద్ధుడి మృత దేహం లభించిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం చెరువులో మృతదేహం తేలియాడుతుందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. కాగా మృతుడు కొంగ బాల నరసింహ (66) గా గుర్తించారు. మృతుడికి చేపలు పట్టే అలవాటు ఉందని, బుధవారం ఇంటి నుంచి వెళ్లిన బాల నరసింహ ఇంటికి రాలేదు. దీంతో కుమారుడు బాలకృష్ణ అను మానంతో నిత్యం చేపలు పట్టే స్థలానికి వెళ్లి చూచేసరికి వలలో చిక్కుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చేపలు పడుతూ ప్రమాద వశాత్తు మృతి చెందవచ్చని భావిస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు తో శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పూర్వ ఉమ్మడి శామీర్పేట మండలంలో ఘనంగా గాంధీ వర్ధంతి

శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో జాతీ పిత మహాత్మగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం శామీర్ పేట మండలంలోని తూంకుంట మున్సి పాల్, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కోసం గాంధీ కన్నకళలను నిజయం చేయాలని, అందుకు



ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరు మహాత్మగాంధీ మార్గంలో నడిచి సమాజ సేవ చేస్తు ఆదర్శంగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంకి మల్లేష్, తుంకి బిక్షపతి, అబ్బగౌని భాస్కర్ గౌడ్, తుంకి రమేష్, ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## 'వక్ఫ్' నివేదికకు జేపీసీ ఓకే

న్యూఢిల్లీ : కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలించి.. పలు మార్పులు, సవరణలు ప్రతిపాదిస్తూ రూపొందించిన నివేదికకు సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) ఆమోదముద్ర వేసింది. 15-11 మెజారిటీతో కమిటీ సదరు రిపోర్టును అంగీకరించిందని బీజేపీ ఎంపీ, జేపీసీ చైర్మన్ జగదంబికాపాల్ విలేకరులకు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని.. బిల్లు చట్టరూపం దాలిస్తే వక్ఫ్ బోర్డు తన విధులను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వర్తించేందుకు తోడ్పడుతుందని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ప్రయోజనాలు పొందేవారి జాబితాలో తొలిసారి పస్మాందా ముస్లింలు, పేదలు, మహిళలు, అనాథలను చేర్చామన్నారు.

# ఇల్లాలు..ఎన్నాళ్లీ కన్నీళ్లు?

హైదరాబాద్: కుషాయిగూడ పరిధిలో రెండోసారి గర్భం దాల్చిన భార్యపై అనుమానంతో.. పొట్టపై కూర్చొని తల్లితో పాటు కడుపులో ఉన్న శిశువును భర్త హత్య చేశాడు. మీర్‌పేట్ పరిధిలో మాజీ సైనికుడు భార్యను హత్య చేసి ముక్కలు చేసి, ఉడకబెట్టి పొడి చేశాడు. రోజుల వ్యవధిలో జరిగిన రెండు ఘటనలు నగర ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. నగరంలోని వివిధ ఠాణాల పరిధిలో నిత్యం 15-20 వరకూ దంపతుల తగాదాలపై ఫిర్యాదులు వస్తుంటాయి. వీటిలో 2-3 శాతం మానసిక, శారీరక వేదనకు గురి చేస్తున్నవే. అక్రమ సంబంధం, అనుమానం, క్షణికావేశంతో మగాళ్లు విచక్షణ కోల్పోతున్నారు. రాజధానిలో గతేడాది సుమారు 40 మంది గృహిణులు హత్యకు గురవ్వగా, 54 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు.



తప్పించుకునేందుకు.. కేసు నుంచి తప్పించుకునేందుకు కొందరు అతితెలివి ప్రదర్శిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతేడాది ఆసిఫ్‌నగర్‌లో అనుమానంపై భార్యను కత్తితో పొడిచిన భర్త.. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ప్రమాదం జరిగిందంటూ వైద్యులను నమ్మించే ప్రయత్నం చేశాడు. పోలీసులు రంగంలోకి దిగటంతో అసలు విషయం వెలుగుచూసింది. నగరంలో చాలావరకూ గృహిణుల అనుమానాస్పద మరణాలు మిస్టరీగానే మిగిలి పోతున్నాయి.

**తీరని వరకట్న దాహం**

కొందరికి పెళ్లి సమయంలో ఇచ్చిన లాంఛనాలు చాలడం లేదంటూ కాపురానికొచ్చిన మొదటి రోజు నుంచే అత్తింట వేధింపులు మొదలవుతున్నాయి. కోడలిని సూటిపోటి మాటలతో వేధిస్తున్న అత్త, ఆడపడచులపై మహిళా పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు పెరుగుతున్నాయి. పాత బస్తీకి చెందిన యువతి ఉన్నత చదువులు పూర్తి చేసింది. ఆర్థిక స్తోమత లేకపోవటంతో తల్లిదండ్రులు సూచించిన ఆటో డ్రైవర్‌ను వివాహమాడింది. నెలరోజుల తరువాత ఆటో కొనేందుకు రూ.2 లక్షలు తీసుకురమ్మంటూ భర్త వేధింపులతో పుట్టింటికి చేరింది.

# పంచాయతీ పోరుకు చకచకా ఏర్పాట్లు

పెద్దపల్లి : పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. తుది ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికారులు.. నాలుగు నెలలుగా తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఎన్నికల సామగ్రి రాగా.. అధికారులు బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేసి గోదాంలో భద్రపరిచారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయింది. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులకు నోడల్ బాధ్యతలు అప్పగించారు.

**పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా**

గ్రామపంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలపై అధికారులు ఆరా తీశారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు వినియోగించిన పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ప్రహరీ, విద్యుత్తు, ఫ్యాన్‌లు, ర్యాంపులు ఇతర మౌలిక వసతులు తనిఖీ చేశారు. సమస్యలు తెలుసుకున్నారు. లోపాలు సవరించుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలించారు. వార్డుల్లో ఓటర్లు పెరిగితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో ఎన్నికల సేన**

జిల్లాలోని 269 పంచాయతీల్లో ఎన్నికలకు అధికారులు, సిబ్బంది వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. పెద్దపల్లి డివిజన్‌లో 3,181, మంథనిలో 890 మంది సిబ్బంది ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉద్యోగుల స్థానికత, ఎప్పుడు విధుల్లో చేరారు? ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? ఆధార్, చరవాణి నంబరు, ఇతరత్రా వివరాలు నమోదు చేస్తున్నారు. ఉద్యోగుల ఆన్‌లైన్‌పై ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**పూర్తయిన బ్యాలెట్ పత్రాల ముద్రణ**



ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ముగిసింది. సర్పంచిల ఎన్నికకు గులాబి, వార్డు సభ్యుడికి తెలుపు రంగులో బ్యాలెట్ పేపర్లను ముద్రించారు. ఎన్నికల సంఘం సర్పంచికి 20, వార్డు సభ్యుడికి 10 గుర్తులు కేటాయించారు. జిల్లాలో 4,13,086 ఓటర్లు ఉండగా సర్పంచికి 5,04,000 వార్డు సభ్యులకు 4,99,000 బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేశారు. వీటిని జిల్లా గోదాములో భద్రపరిచారు.

**బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేశాం**

జిల్లాలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాం. బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేశాం. సర్పంచి, వార్డు సభ్యులకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు ముద్రించాం. వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లా వివరాలు

గ్రామపంచాయతీలు: 269

మొత్త ఓటర్లు: 4,13,086

పోలింగ్ కేంద్రాలు : 2,486

ఎన్నికల సిబ్బంది : 4,071

బ్యాలెట్ పెట్టెలు :3,125

# బడి బస్సులు భద్రమేనా!



కరీంనగర్ : విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు పూర్తి సామర్థ్యంతో ఉండాలి.. లేకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. ఏటా రవాణా శాఖ అధికారులు విద్యా సంస్థల బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేసిన తర్వాతే ఆ వాహనాలు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. విద్యా సంస్థలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి కాలేదు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,720 బస్సులు ఉండగా అందులో 108 బస్సులకు ఇంకా సామర్థ్య పరీక్షలు నిర్వహించలేదు. ప్రతి ఏటా మే 15 నుంచి జూన్‌లో విద్యా సంస్థలు తిరిగి ప్రారంభమయ్యే లోపు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. మరో మూడు నెలల్లో విద్యాసంవత్సరం ముగుస్తుండగా బస్సుల సామర్థ్య పరీక్షలు పూర్తి కాకపోవడం చూస్తే యాజమాన్యాల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత అర్థం చేసుకోవచ్చు.

**నిబంధనల అమలు ఎక్కడ?**

విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు తప్పనిసరిగా పూర్తి కండిషన్‌తో ఉండాలి. ఆర్టీఏ నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన తర్వాతే రోడ్లపై తిరగాలి. ప్రతి బస్సులో పరిమితి మేరకు విద్యార్థులను ఎక్కించుకోవాలి, సుశిక్షితులైన, అనుభవజ్ఞులైన చోదకులు, అనుభవం ఉన్న అటెండర్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతి బస్సులో ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరి. డ్రైవరు వివరాలు కన్పించేలా బోర్డుపై ప్రదర్శించాలి. అయితే చాలా బస్సుల్లో ఈ నిబంధనలు పాటించడం లేదు.

**తనిఖీలు ఏవీ?**

విద్యాసంస్థల ప్రారంభంలో హడావుడి చేసే రవాణా శాఖ అధికారులు తిరిగి వాటి జోలికి వెళ్లడం లేదు. నామమాత్రంగా తనిఖీ చేసి ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంస్థల బస్సులను తరచూ తనిఖీ చేసినట్లైతే లోపాలు బయటపడే అవకాశం ఉంటుంది. ఒకవైపు ప్రభుత్వం భద్రతా మాసోత్సవం పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇలాంటి తరుణంలో సామర్థ్య పరీక్షలు చేయకుండానే బస్సులు రోడ్లపై తిరుగుతుండటం విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది.

**నోటీసులు జారీ చేస్తాం**

ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా బస్సులు రోడ్లపై తిరగొద్దు. సామర్థ్య పరీక్షలకు రాని బస్సుల్లో కొన్నింటిని స్క్రాప్ చేశారు. తనిఖీలు ముమ్మరం చేస్తాం. ఫిట్‌నెస్ పరీక్షలకు సంబంధించి బస్సుల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. పురుషోత్తం, డీటీసీ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా

# నిధుల మంజూరుతోనే పనులకు మోక్షం



జగిత్యాల : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ద్వారా జిల్లాలో పెద్దఎత్తున ఆయకట్టు స్థిరీకరణ పనులకు అధికారులు గతంలోనే ప్రతిపాదనలు పంపించారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్లో ప్రతిపాదిత పనులకు నిధులను విడుదల చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేస్తే ఆయకట్టేతర ప్రాంతం కూడా ఆయకట్టు పరిధిలోకి వస్తుందని అన్నదాతలు అభిలషిస్తున్నారు.

**ప్రతిపాదిత పనులు**

వరద కాలువకు అనుబంధంగా రూ.763.31 కోట్లతో పలు పనులకు ప్రతిపాదించారు. ఇందులో కథలాపూర్ మండలం దుంపేట వద్ద పంపుహౌస్‌ను నిర్మించి 52.30 కి.మీ. వద్ద ఓటీ ద్వారా నీటిని తీసుకొని కలికోట సూరమ్మ చెరువు, లక్కాకుల, తుమ్మల చెరువులను నింపాలి. రుద్రంగి చెరువు ప్రధాన కుడికాలువ కొత్తపేట, మోత్కురావుపేటల వద్ద పంపుహౌస్‌లను నిర్మించి కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లోని ఎల్లమ్మ తదితర చెరువులను నింపాలి.

వరద కాలువ 47.600 కిలోమీటరు వద్ద ఎడమ కాలువ పంపుహౌస్ నిర్మాణంతో 14ఆర్ కాలువ నింపటం ద్వారా కథలాపూర్, మెట్పల్లి మండలాలకు నీరందుతుంది.

వరద కాలువ 67.500 కి.మీ. వద్ద కుడికాలువ పంపుహౌస్ నిర్మాణంతో 15ఆర్ కాలువను నింపటం ద్వారా మేడిపల్లి, జగిత్యాల, మల్యాల మండలాలకు నీరందుతుంది.

59.500 కి.మీ. వద్ద కుడి కాలువ పంపుహౌస్ ద్వారా మేడిపల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల మండలాలకు నీరు పారుతుంది.

76.22 కి.మీ. మద్దుట్ల వద్ద పంపుహౌస్ నిర్మాణంతో కొత్తచెరువు నిండుతుంది. గౌర్రెగుండం గుడిచెరువు వద్ద పంపుహౌస్‌తో నల్లమట్టు చెరువును నింపవచ్చు. ఈ ప్రధాన పనులతో పాటుగా కొడిమ్యాల మండలంలో పలు నిర్మాణాలు, వరదకాలువలో రంగాపూర్ వద్ద 3.5 కి.మీ లైనింగ్ తదితర పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

ప్రధానంగా 8 పనులను రూ.805.31 కోట్లతో చేపట్టడంతో అదనంగా 54,215 ఎకరాల భూమికి సాగునీరంది ఆయకట్టు పరిధిలోకి వస్తుంది. జిల్లాలో 35 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని తలపెట్టగా 34 పూర్తయ్యాయి. మిగిలిన ప్రతిపాదిత 40 చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులను విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలో ఆపరేషన్, నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం 130 పనులకు అనుమతులు రాగా పనుల పూర్తికి ఇంకనూ రూ. 20 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. 13 లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయాల్సి ఉండగా 17 లిఫ్ట్ స్కీంలకు మరమ్మతులు, 5 లిఫ్ట్ స్కీంల పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలి. వరదకాలువ నుంచి రూ.13.43 కోట్లతో చేపట్టిన కొండగట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి.

రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీరణను రూ.136 కోట్లతో చేపట్టగా ఈ వేసవిలోపు నిధులను విడుదలచేసి పనులను పూర్తిచేయాలి. కేంద్రం నుంచి పరిపాలన అనుమతులు వచ్చిన 6 చెరువుల పునరుద్ధరణతో పాటుగా మిషన్ కాకతీయ పథకం ద్వారా అసంపూర్తి చెరువుల పునరుద్ధరణకు రూ.119 కోట్ల వరకు నిధులను విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతంలో నూతన నిర్మాణాలు, మరమ్మతులకు ఇప్పట్నుంచి వేసవి వరకు కాలం అనువుగా ఉంటుంది.

# అయిదేళ్లలో అభివృద్ధి జాడలు

సిరిసిల్ల: మున్సిపల్ పాలకవర్గాలు గత అయిదేళ్లలో వివిధ పనులు చేపట్టడంతో పట్టణంలో అభివృద్ధి జాడలు కనిపిస్తున్నాయి. పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా దాదాపు రూ.110 కోట్ల నిధులతో వేములవాడలో పనులు చేపట్టారు. సిరిసిల్లలో సుమారు రూ.145 కోట్లతో పనులు చేశారు. పాలకవర్గం పదవీ కాలం ఆదివారంతో ముగిసింది. ఈనేపథ్యంలో గత పాలకవర్గాలు చేపట్టిన పనుల తీరుపై ప్రత్యేక కథనం. వేములవాడ పట్టణంలో తెలంగాణ కూడలి, శాత్రాజు పల్లి వైపు, నందికమాన్, మల్లారం రోడ్డు, అంబేద్కర్ కూడళ్ల సుందరీకరణ, మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించారు. పట్టణంలో కూరగాయల మార్కెట్, వైకుంఠధామాలు, హరితహారం, డంపింగ్ యార్డు, ఫుట్‌పాత్‌లు, ఎంపీడీవో కార్యాలయంలో పార్కు, బైపాస్ రోడ్డులో చిల్డ్రన్స్ పార్కు నిర్మాణం వంటి పనులు చేశారు.

**చేయాల్సినవి అనేకం..**

పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. వ్యవసాయ మార్కెట్ యార్డులో సమీకృత కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మాణం నిధులు సరిపోక నిలిచిపోయాయి. శివారు కాలనీల్లో అనేక వీధులు ఇంకా కాలువలు, సీసీ రోడ్లకు నోచుకోలేదు. దీంతో మురుగు రోడ్లపై పారుతోంది. బైపాస్ రోడ్డులోని కూరగాయల వ్యాపారులకు షెడ్లు నిర్మించాల్సి ఉంది. చాలా వీధుల్లో రోడ్లు గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

**సిరిసిల్లలో...**

సిరిసిల్లలో కొత్త చెరువు కట్ట, పార్క్ అభివృద్ధి, చిన్న బోనాలలో మినీ స్టేడియం, ముస్లిం శ్మశాన వాటిక, గణేశ్‌నగర్, వెంకంపేటలో ఆధునిక ధోబీఘాట్‌లు, ఆర్‌సీసీ స్టార్మ్ వాటర్ డ్రైన్, పద్మానగర్ ఉదార వాగు నిర్మాణం, పోతిరెడ్డిపల్లిలో అర్బన్ ఫారెస్ట్ పార్క్, బైపాస్ రోడ్లలో సెంట్రల్ లైటింగ్, ప్లాంటేషన్, మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు వంటివి చేపట్టారు.

**వీడని సమస్యలు**



గత మూడేళ్లుగా వర్షాకాలంలో వరదలతో పట్టణమంతా నీట మునుగుతోంది. ఇందుకు ప్రధాన కారణమైన పద్మానగర్ ఉదార వాగు పునర్నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. రూ.6.21 కోట్లతో ప్రారంభించినప్పటికీ పూర్తి చేయలేదు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. పట్టణంలోని 38వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదు. ఓపెన్ జిమ్ పనులు ప్రారంభించలేదు. పదో వార్డులో చిన్న బోనాల గురుకుల వసతి గృహం నుంచి భూపతినగర్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదు. ఏళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

**అందరి సహకారంతోనే...**

ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో అనేక పనులు చేపట్టి పట్టణాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లడం జరిగింది. తమ పాలకవర్గం అన్ని వార్డుల్లో దాదాపు రూ.110 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రామతీర్థపు మాధవి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ వేములవాడ

**పట్టణాభివృద్ధికి కృషి**

అయిదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతులు కల్పించాం. వార్డుల అభివృద్ధికి కృషి చేశాం. గతంలో రూ.40 కోట్లు మంజూరైనప్పటికీ పనులు కాలేదు. అభివృద్ధికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు, పట్టణవాసులకు కృతజ్ఞతలు. జిందం కళ, సిరిసిల్ల పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్

# ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగులు

ఖని : ఎట్టకేలకు తెలంగాణ ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగు పడుతోంది. మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించగా రెండో దశ పనులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదరకపోవడంతో రెండో దశలో చేపట్టాల్సిన 2400 మెగావాట్ల మూడు యూనిట్ల ఏర్పాటుపై సందిగ్ధం నెలకొంది. చివరికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రెండో దశ పనులకు ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ మేరకు బోర్డు ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణంపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రెండు దఫాలుగా వాయిదా పడిన ప్రజాభిప్రాయ సేకరణను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు నిర్మించిన మొదటి దశ ప్రాంతంలోనే రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి పరిసర



గ్రామాలు, రామగుండం ప్రాంత ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేశారు.

**పూర్తిస్థాయిలో అందుబాటులోకి..**

రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన విధంగా తెలంగాణకు ఎన్టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నిర్మించి ఉత్పత్తిని ప్రారంభించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును తెలంగాణ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. కొత్తగా మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను కూడా నిర్మించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతోంది. ఏటా 11.7 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసే విధంగా సింగరేణితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. నిర్మాణం మొదలు పెట్టిన తర్వాత నాలుగేళ్లలో 2400 మెగావాట్ల మూడు యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో చేపట్టిన 1600 మెగావాట్ల రెండు యూనిట్లు గత ఏడాది నుంచి అందుబాటులోకి వచ్చాయి. 2016లో మొదటి దశ విద్యుత్తు కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. 2023, 2024లో రెండు యూనిట్ల పనులు పూర్తిగా వాణిజ్య ఉత్పత్తిలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం రెండో దశలో చేపట్టే 2400 మెగావాట్ల మూడు యూనిట్లను 2030 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీపీసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**పర్యావరణవేత్తల ఆందోళన**


రామగుండంలో నిర్మించనున్న రెండో దశ విద్యుత్తు కేంద్రాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన స్థానికంగా వ్యక్తమవుతోంది. పారిశ్రామిక ప్రాంతంలో గాలి నాణ్యత దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో కలిసి ప్రాణవాయువు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 4,200 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలున్న రామగుండంలో మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నెలకొల్పడం ద్వారా పూర్తి ఉత్పత్తి 6,600 మెగావాట్లకు చేరుకుంటుంది. దీనికోసం రోజుకు సుమారు 80 వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుందని, దీని వల్ల సల్ఫర్‌డయాక్సైడ్ ఉద్గారాలు భారీగా వెలువడుతాయని స్థానికులు చెబుతున్నారు. వీటితో పాటు పరిసర ప్రాంతంలో ఆర్‌ఎఫ్‌సీఎల్, రామగుండం బి-థర్మల్ కేంద్రం, కేశోరాం సిమెంటు కార్మాగారాలు ఉన్నాయని .. వీటి నుంచి సైతం కాలుష్య కారకాలు వెలువడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి అవకాశాలపై పరిసర గ్రామాల ప్రజల నిరసన**

ఎన్టీపీసీ ప్రాజెక్టు కోసం భూములు సేకరించిన యాజమాన్యం పరిసర గ్రామాల యువతకు ఉపాధిని విస్మరించిందన్న ఆరోపణలున్నాయి. ప్లాంటు నిర్మాణం కోసం ఎన్టీపీసీ యాజమాన్యం చుట్టు పక్కల గ్రామాలైన లక్ష్మిపురం, ఎల్కలపల్లి, కుందనపల్లి, రాజాపూర్, రాణాపూర్, మొగల్‌పహాడ్, రామగుండం ప్రాంతాల నుంచి గతంలో భూములు సేకరించింది. ఈ ప్రాంతాలకు చెందిన వారికి ఉపాధి కల్పించకపోవడంతో పాటు కనీసం ఆయా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు సామాజిక బాధ్యతను కూడా సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

# సింహభాగం.. సాగుకు యోగ్యమే!

కరీంనగర్ : జిల్లాలో సింహభాగం సారవంతమైన సాగు భూమి విస్తీర్ణమే ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే జరిపారు. అనంతరం గ్రామసభల ద్వారా రైతుల అభిప్రాయాలు తీసుకొని, జిల్లాలో సాగుకు యోగ్యమైన



భూవివరాలను వెల్లడించారు.

**డివిజన్ల వారీగా వివరాలు..**

జిల్లాలో నాలుగు వ్యవసాయ డివిజన్లు, 207 రెవెన్యూ గ్రామాలున్నాయి. డివిజన్ల వారీగా కరీంనగర్‌లో అత్యధికంగా 1830, మానకొండూర్‌లో 1568, హుజూరాబాద్‌లో 994, చొప్పదండిలో 962 ఎకరాలను సాగుకు యోగ్యం కానివిగా గుర్తించారు. ఈ భూమికి భవిష్యత్తులో రైతుభరోసా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఆర్థిక వెసులుబాటు మేరకు..**

సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సర్వే అనంతరం సాగు యోగ్యమైన భూ వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటును బట్టి విడతల వారీగా రైతు భరోసా ఖాతాల్లో జమ అవుతాయి. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి

# అడిగేది ఎవరు? అడ్డుకునేది ఎవరు?

తాండూరు : జిల్లాలోని కాగ్నా, కాకర వేణి నదుల నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ ఆపు లేకుండా పోతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు అటు వైపు ఎపుడో ఒకసారి చుట్టపుచూపుగా వెళుతున్నారు. దీంతో అక్రమార్కులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా రెండు నదులనూ కొల్లగొడుతున్నారు. ఆర్డర్ల మేరకు భవన నిర్మాణ దారులకు విక్రయించి రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ప్రభుత్వానికి మాత్రం ఆదాయం సమకూరడం లేదు. ట్రాక్టర్ల రాకపోకలతో ఇసుక మేటలతో నిండుగా కనిపించే కాగ్నా, కాకరవేణి నదుల గర్భాలు రోడ్లుగా మారిపోతున్నాయి.

**సెలవు రోజుల్లో మరింత తీవ్రం**

సెలవురోజుల్లో ఇసుకాసురులు రెచ్చి పోతున్నారు. పండగలు, రెండో శనివారం, ఆదివారం వంటి రోజుల్లో రెట్టింపు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఆదాయాన్ని కూడా అదే స్థాయిలో ఆర్జిస్తున్నారు. ఓ అక్రమార్కుడు నిత్యం 5 నుంచి 10 ట్రాక్టర్ల ఇసుక కొల్లగొట్టే స్థానే సెలవు రోజుల్లో 10 నుంచి 20 ట్రాక్టర్ల ఇసుకను తోడేసి విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను నాణ్యతను బట్టి రూ.4,000 నుంచి రూ.6,000 వరకు విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు కనీసం 200 నుంచి 300 ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుక తరలిపోతోంది.

**టాస్క్ ఫోర్స్ పోలీసులు చూసుకుంటారులే..:** ఇసుక రవాణాపై రెవెన్యూ,



గనుల శాఖ అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాల్సి ఉన్నా స్పందించడం లేదు. 'వ్యవహారాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు చూసుకుంటారులే' అని చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో అక్రమార్కుల నదుల కొల్లగొట్టే కార్యక్రమం యథేచ్ఛగా సాగిపోతోంది.

**అనుమతులతో సరి.. పర్యవేక్షణ విస్మరణ**

ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తున్న రెవెన్యూ అధికారులు తర్వాత చేపట్టే పర్యవేక్షణను విస్మరిస్తున్నారు. తాండూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలు, కొడంగల్ నియోజక వర్గంలో జరిగే అభివృద్ధి పనులకు నదుల నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించాలి? ట్రాక్టర్ల నంబర్లు, కాగ్నా, కాకర వేణి నదుల్లో ఎక్కడి నుంచి తరలించాలనే విషయాన్ని అనుమతి పత్రాల్లో పేర్కొంటున్నారు. పలాన తేదీ నుంచి పలాన తేదీ వరకు మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే.. అనుమతి పొందిన వ్యక్తులు ఇసుకను వాస్తవంగా నిర్ణీత ప్రాంతానికి చేరవేస్తున్నారా? పక్కదారి పట్టించి ఎవరికైన విక్రయిస్తున్నారా ?అనే కోణంలో పర్యవేక్షణ జరపడం లేదు. ఏ ట్రాక్టర్ ఎన్ని ట్రిప్పుల ఇసుకను రవాణా చేసిందనే విషయంలో పక్కా లెక్కలు ఉండడం లేదు.

# నిధులున్నా.. నిర్మాణాలు సున్నా..

మెదక్ : పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. బస్తీ దవాఖానాల ద్వారా వైద్యం అందిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చేందుకు నిధులు మంజూరయ్యాయి. స్థలం కేటాయించక పోవడంతో ఏళ్లు గడుస్తున్నా.. నిర్మాణానికి అడుగులు పడటం లేదు. సకాలంలో అధికారులు స్పందించి చర్యలు చేపడితే భవనాలు అందుబాటులోకి రానున్నాయి. లేదంటే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. ఈ అంశంపై కథనం...

**స్థలం కేటాయింపులో జాప్యం...**

జిల్లాలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 157 ఉప కేంద్రాలున్నాయి. 2018లో కేవలం మెదక్ పట్టణంలోనే పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటైంది. తూప్రాన్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొత్తగా ఏర్పడిన మనోహరాబాద్‌కు తరలించారు. దీంతో తూప్రాన్‌లో అర్బన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అధికారులు నిర్ణయించారు. మెదక్‌లో రెండు, తూప్రాన్‌లో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చేందుకు 2023-24లో 15వ ఆర్థిక సంఘం ద్వారా ఒక్కో దానికి రూ.1.43 కోట్లు కేటాయించారు. మెదక్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం అద్దె భవనంలో కొనసాగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిధులు మంజూరైనా స్థలం కేటాయింపులో జాప్యం జరుగుతోంది.



సర్వే నం.114లో 20 గుంటల స్థలం కేటాయించారు. అది అనువుగా లేదని, స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పక్కన పాత శవాగారం స్థలాన్ని కేటాయించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. ఇటీవల మరో పట్టణ ఆరోగ్య కేంద్రం మంజూరైందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తెలిపారు.

**అనుమతి రాగానే..**

తూప్రాన్‌లో రెండు పడక గదుల ఇళ్ల సమీపంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఉన్నతాధికారుల నుంచి సానుకూలత రాకపోవడంతో ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు. పుట్టకోట సమీపంలో పాత వసతి గృహాన్ని కూల్చివేసి ఆ స్థలంలో నిర్మించేందుకు అధికారులు కలెక్టర్‌కు లేఖ పంపారు. అనుమతి రాగానే నిర్మించనున్నారు. పట్టణానికి దగ్గరగా ఉండడంతో గర్భిణులు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**స్థలాలు ఖరారు కాలేదు : శ్రీరాం, జిల్లా వైద్యాధికారి, రవీందర్, ఈఈ, టీఎస్‌ఎంఐడీసీ**

మెదక్, తూప్రాన్ పట్టణాల్లో ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. స్థలం కేటాయించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరాం. ఇంకా స్థలాలు ఖరారు కాలేవు. ఎంపిక పూర్తి కాగానే పనులు మొదలు పెడతాం. తూప్రాన్‌లో సైతం స్థలం ఎంపిక తుది దశలో ఉంది.

# యువతకు ఆత్మీయ ఉపాధి



పాత తాండూరు: గ్రామీణ పేదలకు, యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న 'ఉపాధి హామీ పథకం' అండగా నిలుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికీ యువత చొరవ చూపుతోంది. ఎందుకంటే గతంలో ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులైనా చేసి ఉండటం, ఎలాంటి భూమి లేకుండా ఉండటం వంటి కారణాలతో యువత, మహిళలు ముందుకొస్తున్నారు. 'మేమూ ఉపాధి పనులు చేస్తాం. పని కల్పించండి సార్' అంటూ ఉపాధి పనుల్లో పాల్గొనని యువకులు నెల రోజులుగా గ్రామాల్లో క్షేత్ర, సాంకేతిక సహాయకులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు విన్నవించుకుంటున్నారు.

**వచ్చేది వేసవి కావడంతో..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో జన జీవనానికి వ్యవసాయం, అనుబంధ కూలీ పనులే ఆధారం. వచ్చేది వేసవి కావడంతో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు' డిమాండ్ పెరుగుతోంది. 20 రోజుల ఉపాధి పనులు చేసి ఉండడం, ఎలాంటి భూమి లేకపోవడాన్ని ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేస్తున్నారు. భూ భారతి, ఉపాధి పథకం ఆధార్ అనుసంధాన వివరాలతో ఈ పథకానికి ఎవరు అసలైన అర్హులనేది తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో ఉపాధిలో పనిచేయని వారికీ అవకాశం ఇచ్చేలా పరిశీలిస్తున్నారు.

పనులు అడుగుతున్నారు పనులు చేయండని గతంలో గ్రామాలకు వెళ్లి మేం కూలీలను కోరేవారం. ప్రస్తుతం మాకు పని కల్పించాలని అడుగుతున్నారు. భూమిలేని నిరుపేదలకు ఆత్మీయ భరోసా ఇస్తుండడంతో కనీసం 20 రోజుల ఉపాధి పనులను కోరుతున్నారు. నర్సింహారెడ్డి, సాంకేతిక సహాయకులు, బషీరాబాద్.

**భూమి లేదు.. అర్జీ పెట్టుకున్నా..**

నాకు, నా కుటుంబానికి ఎలాంటి భూమి లేదు. హైదరాబాద్‌లో ప్రైవేటుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాను. రైతుభరోసా పథకం కోసం అర్జీ చేసుకున్నాను. కనీసం 20రోజుల పని కల్పించాలని కోరాను.
నరేష్, యువకుడు, కందనెల్లి.

జిల్లాలో గ్రామ పంచాయతీలు: 566
జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు: 1,86లక్షలు
నమోదైన కూలీల సంఖ్య: 3.77లక్షలు
వేసవిలో కూలీల సంఖ్య: 1.50 నుంచి 2.39లక్షలు
ఈఏడాది 20రోజుల పని చేసినవారు: 79,500

# సమగ్ర సమాచార నిక్షిప్తం.. అపార్



వికారాబాద్ : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే కార్డులో పొందుపరిచేందుకు కేంద్రం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు జిల్లాలో నత్తనడకన సాగుతోంది. వివరాల నమోదుకు ఈనెల 31 తుది గడువు. అయితే జిల్లాలో ఇప్పటికి 11శాతం మాత్రమే నమోదు చేశారు. 250 పాఠశాలల్లో ఈ ప్రక్రియను ప్రారంభించలేదు.

**విద్యార్థుల భవితకు ప్రామాణికం**

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలు కలిపి 1366 ఉన్నాయి. వీటిల్లో 1,48,750 మంది విద్యార్థులున్నారు. అపార్ కార్డులో విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. విద్యార్థులు ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి అపార్ కార్డులోని 12 అంకెల విశిష్ట నంబరును ఉపయోగించి దరఖాస్తు చేసుకునేలా దీన్ని రూపొందించారు.

**సమస్యలు ఇలా..**

తల్లిదండ్రులు వారి పిల్లలకు సంబంధించిన వివరాలు అంగీకార పత్రాలను సకాలంలో అందించటం లేదు.

యూ డైస్ ప్లస్‌లో ఉన్న వివరాలతో విద్యార్థుల ఆధార్ వివరాలు సరిపోవడంలేదు.

ఇంటర్ కళాశాలల్లో పబ్లిక్ పరీక్షలపైనే ప్రధాన దృష్టి నిలపడంతో నమోదు మందగించింది.

కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడం మరో కారణంగా మారింది.

**వేగవంతం చేయాలని సూచించాం..**

విద్యార్థి సమగ్ర సమాచారం పాఠశాల ప్రధానోపాధ్యాయులే నమోదు చేయాలి. నమోదు వేగవంతం చేయాలని సూచించాం. అపార్ పట్ల ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించాం. జి.రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి, వికారాబాద్.

**చిన్న తప్పు ఉన్నా తీసుకోవడం లేదు..**

అపార్ నమోదు ప్రక్రియలో విద్యార్థికి సంబంధించిన ఏ చిన్న తప్పు ఉన్నా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కావడం లేదు. దీంతో స్వీకరించని విద్యార్థి వివరాలు పక్కన పెడుతున్నాం. నాగయ్య, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం కోర్ కమిటీ సభ్యులు

# సూపర్ స్పెషాలిటీ వైద్యం అందేనా..!




కరీంనగర్ :గోదావరిఖనిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో అన్ని విభాగాల్లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించినప్పటికీ గతంలో అందించిన సేవలే కొంత మెరుగు పడటం మినహా అత్యంత అవసరమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల కాలుష్యాలతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో యూరాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాల్లో రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వీటికి సంబంధించిన వైద్య సేవలు గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖర్చులు భరించలేనివారు దేవుడిపై భారం వేసి స్థానికంగా నామమాత్రపు చికిత్సలతో సరిపెట్టుకుంటున్నారు. ప్రాథమిక దశలోనే ఆయా వ్యాధులను గుర్తిస్తే నివారణ సులభతరమయ్యే అవకాశముంది. స్థానికంగా ఆయా విభాగాల్లో చికిత్స, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారంగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో యూరాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాల్లో ఓపీ గదులను ఏర్పాటు చేసినప్పటికీ కేవలం యూరాలజీ వైద్యులు వారంలో రెండు రోజులు మాత్రమే వస్తుండగా, న్యూరాలజీ, కార్డియాలజీ వైద్యులే లేరు.

**యూరాలజీ, న్యూరాలజీలోనూ...** మూత్ర పిండాలకు సంబంధించిన యూరాలజీ, నరాలకు సంబంధించి న్యూరాలజీ విభాగాల్లోనూ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఆసుపత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీ తదితర వైద్యులు అందుబాటులో ఉంటే ప్రాథమిక దశలోనే కిడ్నీ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే రక్తశుద్ధి వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మెదడు, నరాలకు సంబంధించిన కేసులు సైతం అధికంగానే ఉంటున్నాయి. న్యూరాలజీ వైద్యులు అందుబాటులో ఉంటే సకాలంలో చికిత్స అందే అవకాశం ఉంటుంది. ప్రైవేటులోకంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేతనాలు తక్కువగా ఉండటంతో పాటు హైదరాబాద్ నగరానికి దూరంగా ఉండటంతో ఆయా విభాగాల్లోని వైద్యులు గోదావరిఖని వైద్య కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు.

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ నిధులతో లేదా స్థానిక పరిశ్రమల సహకారంతో గోదావరిఖనిలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. సాధారణంగా పీజీ వైద్య విద్యలో సూపర్‌స్పెషాలిటీ కోర్సులుంటే తప్పనిసరిగా కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ విభాగాలు అవసరం కానున్నాయి. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అవసరమైన భవన సదుపాయాలు అందుబాటులో ఉండటంతో ఇటీవలె పీజీ కోర్సుల నిర్వహణకు దరఖాస్తు చేశారు.

**'క్యాథ్ ల్యాబ్' ఏర్పాటుతోనే...** మారుతున్న ఆహారపు అలవాట్లు, జల, వాయు, కాలుష్యాలు తదితర కారణాలతో గత కొంత కాలంగా గుండెపోటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గుండెపోటుతో మృతి చెందుతున్న వారి సంఖ్య ఇటీవల అధికంగా ఉంది. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో 'క్యాథ్ ల్యాబ్' సదుపాయంతో పాటు గుండె వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే ఇందులో అత్యధిక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. ఇందులో ఉపయోగించే ప్రధాన యంత్రానికే సుమారుగా రూ.కోటి వరకు ఖర్చు కానుండగా పూర్తిస్థాయిలో 'క్యాథ్ ల్యాబ్' ఏర్పాటునకు దాదాపుగా రూ.8 కోట్లు అవసరం కానుంది. గోదావరిఖనిలో వైద్య కళాశాల, సార్వజనిక ఆసుపత్రి భవనాల నిర్మాణంలో సంపూర్ణ సహకారాన్ని అందించిన సింగరేణి, ఎన్టీపీసీ తదితర పరిశ్రమలు సమాజహితం కోరి నిధులు కేటాయిస్తే గోదావరిఖనిలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు సులభతరం కానుంది. సింగరేణి ఆసుపత్రిలో క్యాథ్‌లాబ్ ఏర్పాటు చేస్తుండగా అది కేవలం సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమితం కానుంది.

# రూ.కోట్లు మింగేశారు.. దోమలను వదిలేశారు

హైదరాబాద్: బల్దియాలో దోమల నివారణ పేరుతో ఏటా రూ.18.70 కోట్ల డీజిల్‌ను తాగేస్తున్నారు. దీంతో కమిషనర్ ఇలంబర్తి కీలక నిర్ణయం తీసుకున్నారు. డీజిల్‌ను మండిస్తూ పొగను వ్యాపింపజేసే హాట్ ఫాగింగ్ స్థానంలో.. నీటితో పనిచేసే కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. డీజిల్‌లో 75 శాతాన్ని దోపిడీ చేస్తున్న అధికారుల వివరాలను కమిషనర్ ఆరా తీస్తున్నారు. అవకతవకలపై విజిలెన్స్ విచారణ చేపట్టారు.

రూ.25కోట్ల ఖర్చు.. జీహెచ్‌ఎంసీ పరిధిలో దోమల నియంత్రణకు ఏడాదికి రూ.25కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తోంది. దాని ప్రకారం.. 18.7కోట్ల ఇంధనాన్ని పలువురు దోపిడీ చేస్తున్నట్టు గతంలో విజిలెన్స్ నివేదికల్లో పేర్కొన్నారు. ఇటీవలే ఆరుగురు ఎంటమాలజిస్టులపై డీజిల్ దోపిడీ విషయంలో వేటు వేశారు. ఈ క్రమంలో కూకట్‌పల్లి జడ్సీ..



చిన్న ఫాగింగ్ మిషిన్లకు.. రోజూ 10లీటర్ల డీజిల్ ఇవ్వడమేంటనే ప్రశ్న వేసుకుని.. డీజిల్ కోటాను 6లీటర్లకు కుదించారు. తద్వారా ఖర్చు తగ్గింది. ఆ నిబంధనను అన్ని జోన్లలో అమలు చేయాలని కమిషనర్ ఇలంబర్తి ఆలోచిస్తున్నారు.

హాట్ ఫాగింగ్‌తో తలెత్తే అనారోగ్య సమస్యలు, దోమల నియంత్రణ సాధ్యపడకపోవడం, 75శాతం డీజిల్‌ను స్వాహా చేస్తుండటం వంటి లోపాలను దృష్టిలో ఉంచుకుని.. గత కమిషనర్ ఆమ్రపాలి కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని నగరంలో అమలు చేయాలని భావించారు. ఆమేరకు గతేడాది ఎంటమాలజీ విభాగం ఐఏఎస్‌లు, పలువురు ప్రముఖులు నివాసముండే ప్రశాసన్‌నగర్‌లోనే ప్రయోగం చేయగా సత్ఫలితాలు వచ్చినట్లు ధ్రువీకరించింది. కొనసాగింపుగా.. సికింద్రాబాద్‌లోని రొనాల్డ్‌రాస్ ఇనిస్టిట్యూట్, తార్నాకలోని ఐఐసీటీ పైరొథ్రాయిడ్ గ్రూపు శాస్త్రవేత్తలతోనూ చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రస్తుత కమిషనర్ ఇలంబర్తి నిర్ణయించారు.

పొగ రాకుండా..డీజిల్ అవసరం లేదు. నీటి పరిమాణంలో రెండు శాతం డెల్టామెత్రిన్ దోమల మందును కలపాలి. దాన్ని అతి సూక్ష్మ పిచికారి యంత్రాలతో గాల్లోకి వ్యాపింపజేయాలి. ఆ సాంకేతికతను ఫిల్మ్ ఫామింగ్ అక్వియస్ స్ప్రే టెక్నాలజీ(ఎఫ్ఎఫ్ఏఎస్‌టీ) అంటారు. నీటి బిందువులు గాలిలో పొరలా ఏర్పడి దోమలను అంతం చేస్తాయి. హాట్ ఫాగింగ్‌లో మాదిరి.. ఈ విధానంలో సిబ్బందికి ఆరోగ్య సమస్యలుండవు. దుర్వాసన ఉండదు.

# దర్జాగా భూకబ్జా

జగిత్యాల : జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమికి కొందరు వ్యక్తులు ఎసరు పెట్టిన వైనం ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇటీవల జిల్లాకు వచ్చిన ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ జరుపుతున్నట్లు జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్ తెలిపారు.

**80 ఎకరాలు.. 90 మంది..**

సర్వే 437లో 384.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 77 ఎకరాల్లో పేదలకు పట్టాలిచ్చింది. ఆ భూమి పోగా 307 ఎకరాలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం రికార్డుల ప్రకారం 221 ఎకరాలు మాత్రమే ఉంది. సుమారు 80 ఎకరాల భూమిని 90 మంది వ్యక్తులు అక్రమంగా తమ పేర చేయించుకున్నారు. గతంలో కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై పహాణీలో నమోదు చేయించుకొని దాని ద్వారా ధరణిలో పట్టాదారు పాస్ పుస్తకం పొందగా కొందరు నేరుగా ధరణిలో పాస్‌పుస్తకాలు పొందారు. మరికొందరు గతంలో పట్టాపొందిన వారి నుంచి కొనుగోలు చేశారు. ఇంకొందరు తమకున్న కొద్దిపాటి స్థలాన్ని విస్తీర్ణాన్ని పెంచి హక్కులు పొందారు. ఈ విధంగా అక్రమంగా హక్కులు పొందిన వారిలో జిల్లా కేంద్రానికి చెందిన వారే 50 మంది వరకు ఉన్నారు.

**రైతు బంధు స్వాహా**

హైదరాబాద్ సమీపంలోని ఓ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న మహిళా అధికారిణి భర్త పేరిట 30 గుంటల భూమి ఉండగా పలువురు నాయకులు, వ్యాపారులు సైతం తమ పేరిట అక్రమంగా పాస్‌పుస్తకాలు పొంది రైతుబంధు తీసుకున్నట్లు గుర్తించారు. ఆ భూములపై ఇప్పటి వరకు సుమారు రూ.65 లక్షల మేరకు రైతుబంధు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ అక్రమ భూదందా 2015 తర్వాత జరిగినట్లు భావిస్తున్నారు. ప్రధానంగా భూప్రక్షాళన సమయంలో కిందిస్థాయి సిబ్బంది సహకారంతో అక్రమ దందాకు తెర తీసినట్లు తెలుస్తోంది. 251 సర్వే నంబర్‌లోనూ పలువురు భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రభుత్వం కొందరికి పట్టాలు ఇవ్వగా మరికొందరు పెద్దఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడి సాగు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

# అవకాశాలు అపారం

రామాయంపేట : విద్యార్థుల ధ్రువపత్రాలు పోయినా వారు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం 'అపార్' అనే డీజీ లాకర్‌ను తీసుకొచ్చింది. విద్యార్థులకు అది బ్యాంకు లాకర్‌లా పని చేస్తుంది. మరోవైపు ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకునేందుకు అవకాశం ఉంది. అపర్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకౌంట్ రిజిస్ట్రేషన్)లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దేశంలోని పాఠశాల, ఇంటర్ విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నమోదు ప్రక్రియ చేపట్టారు. విద్యార్థి దశలో సాధించిన పతకాలు, విద్యార్హత పత్రాల వివరాలు సులువుగా దేశంలో ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. ఇందుకు ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు నంబరులా.. ఓ యూనిక్ ఐడీని అందజేస్తారు. దీంతో విద్యార్థుల ప్రగతి తెలుసుకోవచ్చు. మరోవైపు నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేసేందుకు దోహదపడనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఈనెల 31 వరకు అవకాశం** మెదక్ జిల్లాలో 1098 పాఠశాలలు ఉండగా 1,33,531 విద్యార్థులు చదువుతున్నారు. గత అక్టోబరులో ఈ ప్రక్రియ ప్రారంభం కాగా ప్రస్తుతం వేగవంతం చేశారు. 24తేదీ వరకు 31480 మంది విద్యార్థులకు ఐడీ ఏర్పాటు చేయగా మరో 1,01,235 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఇది పూర్తిగా ఆధార్‌తో అనుసంధానమై ఉంది.

# ఒకటి నుంచి నుమాయిష్.. విస్తృత ఏర్పాట్లతో జోష్

అబిడ్స్ : జనవరి ఒకటి నుంచి ప్రారంభమయ్యే 'నుమాయిష్'కు నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఏటా 46 రోజుల పాటు అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) నిర్వహిస్తారు. 84వ ప్రదర్శనకు ఇప్పటికే స్టాళ్ల కేటాయింపు పూర్తయ్యింది.

**రెండు వేలకు పైగా స్టాళ్లు..** జంట నగరాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 'నుమాయిష్' తిలకించేందుకు ఏటా సుమారు 20 లక్షల నుంచి 22 లక్షల మంది సందర్శకులు వస్తున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లపై పోలీసు, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, జలమండలి, ట్రాన్స్‌కో, అగ్నిమాపకశాఖ తదితర విభాగాల అధికారులు సమీక్షించారు. ఈ సంవత్సరం సుమారు 2000లకు పైగా స్టాళ్లు కొలువుదీరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాళ్లతో పాటు ప్రైవేటు రంగ సంస్థల స్టాళ్లు కూడా ఏర్పాటు అవుతున్నాయి. శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఏర్పాట్లు ఇలా.. ఎగ్జిబిషన్ మైదానంలో దుమ్ము ధూళి రేగకుండా అవసరమైన ప్రదేశాల్లో టైల్స్ నిర్మాణం



చేపట్టారు. రౌండ్ స్టాళ్లకు బదులు సందర్శకుల సౌకర్యార్థం ఈ సారి ప్రయోగాత్మకంగా స్క్వేర్ స్టాళ్లకు శ్రీకారం చుట్టారు. యశోద ఆసుపత్రి సహకారంతో 24 గంటలు పనిచేసేలా ఆసుపత్రి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు అంబులెన్సులు సిద్ధంగా ఉంచుతున్నారు. మొబైల్ ఏటీఎంలు, సెల్ టవర్లు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తున్నారు.

**115 సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు: బి.సురేందర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి**

'వాచ్ టవర్'తో పాటు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇంటర్నల్ సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తున్నాం. 115 సీసీ టీవీ కెమెరాలు ఉంటాయి. 'కొబ్బరి నీరు' స్టాల్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రారంభోత్సవానికి సీఎంను ఆహ్వానించాం.

# వ్యర్థాల శుద్ధీకరణ లేనట్లేనా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 30 నెలల కిందట రూ.16.50 కోట్లతో ప్రారంభించిన బయోమైనింగ్ ప్రక్రియ మూత పడినట్లుగానే తెలుస్తోంది. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉండగా ఎప్పుడో గడువు ముగిసింది. పలుమార్లు ఏజెన్సీకి నోటీసు ఇవ్వడంతో అప్పుడప్పుడు ప్రారంభించి పత్తా లేకుండా పోతున్నారు. ఈ ఏజెన్సీకి బిల్లులు ఇవ్వకపోవడం ప్రధాన కారణమంటున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. పేర్చుకుంటూ పోవడం తప్ప ప్రత్యామ్నాయ చర్యలు ఏవీ లేకపోవడంతో నగరానికి చెత్త నిల్వలు సవాల్‌గా మారాయి.

**డంపింగ్‌యార్డులో తగ్గని పొగ**

డంపింగ్‌యార్డులో వేసవి రాకముందే మంటలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి నుంచే మంటలు వస్తుండటంతో ఆయా



ప్రాంతవాసులు ఉలిక్కిపడుతున్నారు. ఇటీవల ఎల్లమ్మగుడి వైపు, మానేరు వాగు వైపు చెత్తా అంటుకుంది. ఈదురుగాలులు వీస్తుండటంతో మంటలు వస్తున్నాయి. మంటలు అధికమైతే చాలు బల్దియా ట్యాంకర్లు, అగ్నిమాపక యంత్రం ద్వారా నీటితో పట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే ఇప్పటికీ అప్పుడప్పుడు వంతెన వైపు పొగ వస్తూనే ఉంది. అలుగునూర్, కోతిరాంపూర్, రామగుండం బైపాసు రోడ్డులో పొగ, వాసన వస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడంలేదు. బయోమైనింగ్ పనులు తిరిగి ప్రారంభించాలని నోటీసు ఇచ్చామని పారిశుద్ధ్య విభాగం అధికారి తెలిపారు. స్థలం కావాలని పాలనాధికారికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

**ఆకులతో అంటుకుంటున్న మంటలు**

నగరంలో విద్యుత్తు తీగలకు తగులుతున్న చెట్లు, కొమ్మలను కొడుతుండటం, అదంతా తీసుకొచ్చి డంపింగ్‌యార్డులో పడేస్తున్నారు. ఆకులు, కొమ్మలు ఎండిపోయి త్వరగా మంటలు వస్తున్నట్లుగా కార్మికులు అంటున్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు తీసుకొచ్చి వేస్తున్నారు. ఇలాంటి వ్యర్థాలు డంపింగ్‌యార్డులో ఎక్కువయ్యాయి.

# కొలిక్కిరాని శాశ్వత రహదారి పనులు

రామడుగు: రామడుగు శివారు మోతె వాగు వంతెన పనుల్లో అడుగు ముందుకు పడటంలేదు. కొత్త వంతెనకు ఇరువైపులా శాశ్వత రహదారి నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడంతో భూనిర్వాసిత రైతులు ఒప్పుకోలేదు. గత నెల 29న రూ.1,54,73,000 పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ పరిపాలనా పరమైన ఆలస్యం కావడంతో పరిహారం అందక రైతులు ఎదురుచూస్తున్నారు. మరో వైపు గుత్తేదారు పనులు చేపట్టేందుకు తన పొక్లెయిన్‌ను వంతెన వద్దకు తరలించారు. కానీ అధికారుల



నుంచి పరిహారం చెల్లింపుపై స్పష్టమైన సమాచారం లేక రైతులు రోడ్డు పనులు నిలిపివేశారు. రామడుగు, గంగాధర, పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు చెందిన 60 గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచి కరీంనగర్ వెళ్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే వంతెన ఈ ప్రాంతంలో రాకపోకలకు కీలకంగా మారింది. కొత్త వంతెన నిర్మాణం పనులకు గత సెప్టెంబరులో రూ.11.20 కోట్లతో సవరణ ప్రతిపాదనలు చేశారు. ఈ వంతెనకు ఇరువైపులా తాత్కాలికంగా పోసిన మట్టితో దుమ్ము వ్యాపిస్తోంది. దీనికితోడు గుంతలు పెరిగి వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిహారం చెల్లించి తారు రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నోరు విప్పు.. అవినీతి తప్పు!



తాండూరు : జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి యథేచ్ఛగా సాగిపోతోంది. ఎవరైనా చొరవ చూపి ఫిర్యాదుచేస్తేనో, ఆకస్మిక దాడులవల్లో అవినీతి వెలుగుచూస్తోంది. ముఖ్యంగా ఈ వ్యవహారం రెవెన్యూ, పోలీస్, విద్యుత్తు, గనులు, పురపాలిక, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆచారంగా మారింది. తాజాగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వెలుగుచూసిన అవినీతి ఘటన మరోసారి చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో కథనం. 2023లో తాండూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన జమీరొద్దీన్ రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. తహసీల్దారు కార్యాలయాల్లోనూ..తహసీల్దారు కార్యాలయాల్లోనూ అవినీతి నిరంతరాయంగా సాగుతోంది.

నాలుగేళ్ల కిందట పెద్దేముల్ తహసీల్దారు రామహరి ప్రసాద్ మంబాపూర్ నివాసి భూమిని పట్టా చేయడానికి డబ్బులు డిమాండ్ చేశారు. అతను ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో తహసీల్దారుకు డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. 2013లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను యాలాల తహసీల్దారు చిన్నప్పలనాయుడు పట్టుకోగా సదరు యజమాని కోర్టునుంచి రిలీజ్ ఆర్డర్ తెచ్చారు. ఇందుకోసం అటెండర్ రూ.15వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. విచారణలో తహసీల్దారు పేరు చెప్పాడు.

**ఇసుక దందా.. పోలీసులకు వరం**

కాగ్నా, కాకర వేణి నదుల ఆధారంగా జరుగుతున్న ఇసుక దందా పోలీసులకు వరంలా మారింది. గతంలో పెద్దేముల్ ఎస్సైగా పనిచేసిన చంద్రశేఖర్ ఇసుక ట్రాక్టర్‌ను విడుదల చేయడంలో డబ్బు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

యాలాల పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన కానిస్టేబుల్ ఇసుక దందా నిర్వహించే వ్యక్తి వద్ద డబ్బులు వసూలు చేస్తూ ఏసీబీకి దొరికాడు.

విద్యుత్తు శాఖలో మూడేళ్ల కిందట నిబంధనల మేరకు మీటరు ఇవ్వాలని కోరిన తాండూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఏడీగా పనిచేసి రాందాసు డబ్బులు డిమాండ్ చేశాడు. ఆ వ్యక్తి కింది స్థాయి సిబ్బందికి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ పట్టుకుంది. వారు ఏడీ పేరు చెప్పడంతో కేసు నమోదు చేశారు.

తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నియామకంలో అవినీతి సాగుతోందని బహిరంగంగానే విమర్శలొస్తున్నాయి.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో మొదటిసారి

తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం మొదటిసారి దాడులు నిర్వహించారు. భూ మార్పిడికి పరిపాలన విభాగం అధికారి దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు దుద్యాలకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.5లక్షలు లంచం తీసుకుంటూ దొరికారు. కార్యాలయంలో మొదటిసారిగా ఇంత పెద్దమొత్తంలో లంచం తీసుకుంటూ పట్టుబడింది వీరే కావడం గమనార్హం.

**ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ 1064** ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. ఫిర్యాదుదారుని పేరు, వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు.

# స్వనిధి.. వీధి వ్యాపారులకు ఉపాధి



కరీంనగర్: ప్రధానమంత్రి స్వనిధి పథకం వీధి వ్యాపారులకు అవకాశంగా మారింది. ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు ఉపాధి మెరుగు పర్చుకోవడానికి ఆసరా కలిగింది. ఉమ్మడి జిల్లాలోని నగర, పురపాలికల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధి వ్యాపారులకు.. కరోనా లాక్‌డౌన్ తర్వాత నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మ నిర్భర్ పథకం కింద స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల నుంచి రక్షణ పొందేలా రోజు వారీగా పని చేసే వీధి వ్యాపారులను గుర్తించి పేర్లను నమోదు చేసుకున్నారు. గుర్తించిన లబ్ధిదారుడికి మొదటి విడతలో రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తుండగా ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ అవుతుంది.


**రూ.50 వేలకు పెరిగిన రుణం**

నగరపాలికలు, పురపాలికల్లో గుర్తించిన వీధివ్యాపారులకు నాలుగేళ్ల కిందట ప్రతి వీధివ్యాపారికి రూ.10 వేలు ఖాతాలో జమ చేయగా, ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించాలి. సక్రమంగా చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి అర్హత లభిస్తుంది. ఇలాంటి వారికి రెండో విడతలో రూ.20 వేలు అందిస్తుండగా తాజాగా ఈ మొత్తాన్ని మూడో విడతలో రూ.50 వేలకు పెంచారు. రుణ మొత్తం క్రమేణా పెరుగుతుండటంతో సరైన విధంగా వాయిదాలు చెల్లిస్తే బ్యాంకర్లే నేరుగా పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపించే అవకాశముంటుంది. తద్వారా వ్యాపారాభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

**ఎప్పటికప్పుడు లక్ష్య సాధన**

ఆత్మనిర్భర్ కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధిస్తుంది. పలు పురపాలికలు, కార్పొరేషన్లు ఆయా లక్ష్య సాధనకు పోటీ పడుతున్నాయి. జిల్లాల వారీగా స్థానాలు కేటాయిస్తుండటంతో రుణాలు ఇప్పించడం, చెల్లించేలా ప్రోత్సహించడాన్ని మెప్మా అధికారులు చొరవ చూపుతున్నారు. మార్చి నెలాఖరులోగా నిర్ణీత మొత్తాన్ని వీధివ్యాపారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# ముంపు పరిహారానికి మోక్షమెప్పుడో?



భువనగిరి : నీళ్లు విడుదల చేస్తామని చెప్పి మూడేళ్లు అవుతోంది. ముంపు గ్రామానికి అవార్డు పాసై ఏడాది కావొస్తోంది. సగం నిధులు మంజూరు చేస్తూ నెల రోజులు దాటింది. కానీ ఇంత వరకు డబ్బులు విడుదల చేయలేదు. మిగిలిన డబ్బులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితుల్లో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్ ముంపు నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

**ఇదీ విషయం**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపూర్‌లో 11.39 టీఎంసీల సామర్థ్యంతో నృసింహసాగర్ జలాశయం నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. దాదాపు 90శాతం నిర్మాణం పూర్తయినా పునరావాసం, పునర్ నిర్మాణం, భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం డబ్బులు చెల్లించడంలో గత ప్రభుత్వం జాప్యం చేయగా ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం రేపు.. మాపు అంటూ దాటవేస్తూ నిర్వాసితులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. 1.50 టీఎంసీల నీరును విడుదల చేస్తామని కేసీఆర్ ప్రభుత్వం 2020లోనే ప్రకటించింది. గ్రామం ముంపునకు గురవుతుందని తేదీ 5.2.2020 నోటిఫై చేశారు. 597 గృహాలు మునిగిపోనున్నాయని గుర్తించి సామాజిక, ఆర్థిక సర్వే చేసి 822 ఇళ్ల ప్లాట్లు అందజేశారు.

**జీవో వచ్చినా విడుదల కాని నిధులు**

ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్థులకు పునరావాసం, పునర్ నిర్మాణం కింద భువనగిరి హుస్సేనాబాద్‌లోని సర్వే నెంబరు 107లో సుమారు 75 ఎకరాల్లో కాలనీకి 822 గ్రామస్థులకు ప్లాట్లు కేటాయించారు. కాలనీ అభివృద్ధి పనులు చేపట్టారు. కొన్ని నిర్మాణాలు ప్రారంభించారు. తిమ్మాపూర్ గ్రామస్థులకు ఇళ్లు, ఇతర నిర్మాణాలు, చెట్లు చేమలు, బోర్లకు పరిహారం చెల్లించలేదు. సర్వే పూర్తి చేసి గత ఏడాది జనవరిలో అవార్డు పాస్ చేశారు. వీటికి కాను రూ. 109.72 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు. 5.1.2024న అప్పటి కలెక్టర్ అవార్డు పాస్‌చేశారు. ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది.

ముంపునకు గురవుతున్న నిర్వాసిత గ్రామానికి రూ.109.72 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా రూ.50 కోట్లు మంజూరు చేస్తూ తేదీ 13.11.24న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ డబ్బులు విడుదల చేయలేదు. మిగిలిన రూ.58 కోట్లను ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి ఉంది.

**వెంటనే పరిహారం చెల్లించాలి -ఉడుత ఆంజనేయులు, బీఎన్ తిమ్మాపూర్**

అవార్డు పాస్ చేసి ఏడాది అవుతుంది. కానీ డబ్బులు రాలేదు. రేపు మాపు అంటూ అధికారులు తిప్పిస్తున్నారు. వెంటనే డబ్బులను విడుదల చేయాలి. పరిహారం డబ్బులు సకాలంలో వస్తే కొత్తకాలనీలో ఇళ్లు నిర్మించుకునే వాళ్లం. లేదా మరోచోట స్థలం కొనుగోలు చేసుకునే వాళ్లం. తమ భూములు లాక్కుని, ఉన్న ఊరును ఖాళీ చేయిస్తూ డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరం.

# బకాయిల భారం

కోరుట్ల : విద్యుత్తుశాఖకు బకాయిలు భారంగా మారాయి. నెలలో 200 యూనిట్లలోపు వినియోగించుకున్న వారికి ఉచితంగా విద్యుత్తును అందజేస్తుండగా వ్యవసాయానికి ఉచితంగా సరఫరా చేస్తోంది. మిగతా అవసరాలకు వినియోగించుకున్న విద్యుత్తు బిల్లులను సకాలంలో వినియోగదారులు చెల్లించకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇళ్లు, దుకాణాలు, వాణిజ్య, వ్యాపారాల అవసరాలకు వినియోగించుకున్న విద్యుత్తు బిల్లులను నెలనెలా కచ్చితంగా వసూలు చేసే విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది ప్రభుత్వశాఖల, మున్సిపల్, గ్రామపంచాయతీల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వశాఖలు, కార్యాలయాలు విద్యుత్తు బిల్లుల చెల్లింపుల్లో ఏళ్ల తరబడి జాప్యం ప్రదర్శిస్తున్నారు. డిసెంబర్ 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు వివిధ శాఖల్లో పేరుకుపోయిన బిల్లులు భారీగా ఉన్నాయి.విద్యుత్తుశాఖ మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో కోరుట్ల, మెట్‌పల్లి పురపాలక సంఘాలతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలు ఉన్నాయి. కోరుట్ల పురపాలక సంఘం రూ.1.44 కోట్లు, మెట్‌పల్లి పురపాలక సంఘం రూ.1.47 కోట్ల బకాయిలున్నాయి. ఏడు



మండలాల గ్రామపంచాయతీల విద్యుత్తు బకాయిలు మొత్తం రూ.9.38 కోట్లు ఉన్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌లు ఏడు మండలాల్లో గ్రామపంచాయతీలు, వివిధ ప్రభుత్వ విద్యాలయాలు, శాఖల, కార్యాలయాలు ఇలా మెట్‌పల్లి విద్యుత్తుశాఖ సర్కిల్ పరిధిలో ఏడాది కాలంగా మొత్తం రూ.13.73 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటి వసూలు కోసం విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా చెల్లింపుల్లో ఆయాశాఖ అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్తుశాఖ మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని రెండు పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీలు, వివిధ శాఖల్లో పేరుకుపోయిన బకాయిలు ఇలా ఉన్నాయి.

# జప్తు తాఖీదులు.. భూముల వేలం

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ మండల పరిధిలోని కొందరు రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు తిరిగి చెల్లించలేదు. దీంతో నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు రైతులకు తాఖీదులు జారీ చేస్తున్నారు. రుణాల వసూళ్లకు తనఖా పెట్టిన భూములను వేలం వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**ఏయే పరిధిలో ఎంతంటే..**

దుర్కి, నస్రుల్లాబాద్, మైలారం, నాచుపల్లి, మిర్జాపూర్ గ్రామాల్లోని పీఏసీఎస్‌ల పరిధిలో రైతులు 2009 నుంచి 2019 వరకు విడతల వారీగా దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. పలు కారణాలతో చెల్లించలేదు.ఐదు రోజుల కిందట దుర్కి సహకార పరిధిలోని అంకోల్ తండా, సంగెం, అంకోల్, బస్వయిపల్లి గ్రామాల్లోని ఐదుగురు రైతులకు తనఖా పెట్టిన భూములను వేలం వేసేందుకు అధికారులు జప్తు తాఖీదులు జారీ చేశారు. భూముల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న అంకోల్ తండా రైతు అనూషబాయి భూమిని వేలం వేసేందుకు జిల్లా అధికారులు రాగా.. రూ.2 లక్షలు చెల్లించడంతో వాయిదా వేశారు. నస్రుల్లాబాద్ సొసైటీలో 150 మంది రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉంది. మైలారం సొసైటీలో 27 మంది రూ.1.74 కోట్లు చెల్లించాలని అధికారులు గతేడాది డిమాండ్ తాఖీదులు జారీ చేశారు. మైలారానికి చెందిన రైతు తోటవార్ సాయిలు ఇటీవల రూ.3 లక్షల రుణం చెల్లించడంతో భూముల వేలం వాయిదా వేశారు.

వడ్డీతో కలిపి మరింతగా..

దుర్కి సొసైటీ పరిధిలో 2009 నుంచి 2014 వరకు 370 మంది రైతులు రూ.8 కోట్ల రుణాలు తీసుకున్నారు. సకాలంలో చెల్లించక



వడ్డీతో కలిపి ఇది రూ.13 కోట్ల వరకు అయింది. నాచుపల్లి సొసైటీలో 2015 నుంచి 2017 వరకు 70 మంది రైతులు తీసుకున్న రూ.2 కోట్ల రుణం వడ్డీతో కలిపి రూ.3.50 కోట్లు అయింది. మిర్జాపూర్ సొసైటీలో 2016 నుంచి 2018 వరకు నలుగురు రైతులు రూ.18 లక్షల రుణం తీసుకోగా.. ప్రస్తుతం రూ.30 లక్షలు చెల్లించాల్సి ఉంది.రూ.3 లక్షలు చెల్లించాను

– రావుల స్రవంతి, సంగెం

దుర్కి సొసైటీలో 2016లో పాల డెయిరీ కేంద్రానికి రూ.4.50 లక్షల రుణం తీసుకున్నాం. వడ్డీతో కలిపి రూ.7.86 లక్షలు అయిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు విడతల వారీగా రూ.3 లక్షలు చెల్లించాను. ఇంకా చెల్లించాలని అధికారులు నిత్యం వేధిస్తున్నారు.

**రుణం కట్టడంతో వాయిదా వేశాం**

– సందీప్, ఎన్‌డీసీసీబీ బ్యాంకు మేనేజర్, నస్రుల్లాబాద్

రుణాలు చెల్లించని రైతులకు ఎన్‌డీసీసీబీ డీఆర్‌వోఎస్‌డీ అధికారుల ఆదేశాల మేరకు తాఖీదులు జారీ చేస్తున్నాం. ఇటీవల ఓ రైతు భూమిని వేలం వేసేందుకు సిద్ధం కాగా.. కొంత రుణం చెల్లించడంతో వేలం వాయిదా వేశాం. తాఖీదులు స్వీకరించిన కొంత మంది రైతులు రుణాలు చెల్లిస్తున్నారు.



# పెట్టుబడులు సాధించే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలి

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) 3వ సమావేశం ప్రారంభమైంది. ఇందులో 15 ప్రాజెక్టులకు సంబంధించి పెట్టుబడులకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకోనున్నారు. రూ.44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలపనున్నారు.

ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. గత రెండు సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల స్థితిగతులపైనా ఇందులో చర్చించనున్నారు. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతర చర్చలు జరిపి సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, మంత్రులు పెట్టుబడులను ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరితగతిన ఫలితాలు చూపించాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర స్థాయిలో అనుమతులు, క్షేత్ర స్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష చేయాలని ప్రధాన కార్యదర్శికి తెలిపారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థల నుంచి, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేందుకు ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.



# పుంగనూరు ఓటర్ల లిస్టు కన్నా పెద్దిరెడ్డి పాపాల లిస్టే ఎక్కువ

అమరావతి: రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు జగన్ అయితే.. ఆయన్ను మించిన వ్యక్తి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని ఏపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు  పుంగనూరు ఓటర్ల లిస్టు కన్నా పెద్దిరెడ్డి అవినీతి, పాపాల లిస్టే ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన పగలు పూజలు.. రాత్రంతా దోపిడీలు చేస్తుంటారని ఆరోపించారు. పెద్దిరెడ్డి అవినీతి సామ్రాజ్యం మండల స్థాయి నుంచి కేంద్రం వరకు పాకిందన్నారు. శివశక్తి పాల డైయిరీ ద్వారా రైతుల రక్తాన్ని పీల్చుతున్నారన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో అసైన్డ్ భూములు, పుంగునూరు మండలం రాగానిపల్లెలో భూములు కొట్టేయలేదా అని ప్రశ్నించారు. రేణిగుంట పరిధిలోని 20 ఎకరాల ప్రభుత్వ భూమి పెద్దిరెడ్డి భార్య పేరున ఎలా వచ్చిందని అనురాధ నిలదీశారు.

# జగన్ బంధువుకు బైరైటీస్ గనుల కేటాయింపుపై ఏపీ ప్రభుత్వం సీరియస్




అమరావతి: వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ బంధువు వెంకటరెడ్డికి బైరైటీస్ గనుల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుత గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 14 వరకు సెలవుపై వెళ్లారు.

ఈ నేపథ్యంలో గనుల శాఖ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం.. జీఏడీ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనాకు అప్పగించింది. ఏపీ ఎండీసీ ఎండీ బాధ్యతలను కూడా ముఖేష్ కుమార్ మీనాకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**ఏం జరిగిందంటే?..** జగన్‌కు వరుసకు సోదరుడు, పులివెందులకు చెందిన వైఎస్ వెంకటరెడ్డికి.. సంక్రాంతి పండుగ సమయంలో లీజు రూపంలో భారీ కానుక ఇచ్చింది రాష్ట్ర గనుల శాఖ. వైఎస్సార్ జిల్లా వేములలో దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువైన ముగ్గురాయి (బెరైటీస్) నిల్వలున్న లీజును కట్టబెట్టింది. సెలవు రోజుల్లో, ఈనెల 15న కనుమ పండుగ నాడు లీజు కేటాయిస్తూ గనులశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ ఫైలు ఆగమేఘాలపై కదలడం వెనుక వైఎస్సార్ జిల్లాకు చెందిన తెదేపా ముఖ్యనేత ఒకరి సహకారం ఉన్నట్లు సమాచారం. వేములలో సర్వే నంబర్లు 1021/26, 43ల్లో 11.6 హెక్టార్లలో ముగ్గురాయి ఖనిజ లీజుకు వెంకటరెడ్డి 2016లో దరఖాస్తు చేసుకున్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ దస్త్రం వేగంగా కదిలింది. 9.55 హెక్టార్లలో ముగ్గురాయి లీజుకు గనులశాఖ ఎర్రగుంట్ల సహాయ సంచాలకులు 2020 మార్చిలో ప్రతిపాదన పంపారు. గనులశాఖ అప్పటి సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి ఈ లీజు ఫైల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపారు. తాజాగా వైఎస్ వెంకటరెడ్డికి 9.55 హెక్టార్లలో 20 ఏళ్ల కాల వ్యవధితో లీజు మంజూరుచేస్తూ ఈనెల 15న డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వు జారీచేశారు.

# అచ్యుతాపురం బ్రాండిక్స్ పరిశ్రమ ఎదుట మహిళా కార్మికుల ఆందోళన



విశాఖపట్నం: అరగంట అదనంగా పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పాటు, పదేళ్లుగా వేతనాలు పెంచలేదని ఆరోపిస్తూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని బ్రాండిక్స్ పరిశ్రమ మహిళా ఉద్యోగులు ఆందోళనకు దిగారు.

కంపెనీలో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపిస్తూ వేలాది మంది కార్మికులు బ్రాండిక్స్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. తెల్లవారు జామున 3గంటలకు ఇంటి నుంచి బస్సులో బయలుదేరి పరిశ్రమకు వచ్చి.. రాత్రి 10.30గంటల వరకు పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

వేతనాలు పెంచకపోగా, ఆదివారం కూడా పనిచేయిస్తూ కుటుంబాలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# మహా కుంభమేళాలో మరోసారి అగ్ని ప్రమాదం

ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో మరోసారి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్-22లోని ఛట్‌నాగ్ ఘాట్‌వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటలో దాదాపు 15 గుడారాలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఎవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. 11రోజుల క్రితం రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు వ్యాపించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో 18 టెంట్లు దగ్ధమయ్యాయి.



# బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లు

## బడ్జెట్ సమావేశాల్లోనే 'వక్ఫ్ బిల్లు'.. అఖిలపక్షానికి జాబితా ఇచ్చిన కేంద్రం

దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం (జనవరి 31) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలోనే నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది. బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించాయి.



# ఏపీలో వాట్సప్ గవర్నెన్స్

అమరావతి: దేశంలో తొలిసారిగా 'మన మిత్ర' పేరుతో ఏపీ ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఈ సేవలను ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేశ్ (%చీఘీఘ రాశీఎవంష్ట్ర%) ప్రారంభించారు. దీనికోసం అధికారిక వాట్సప్ నంబర్ 95523 00009ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ ఎకౌంట్‌కు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్క్) ఉంది. పౌరసేవలు అందివ్వడంతో పాటు ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది.  కార్యక్రమం ప్రారంభం సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడారు. "వాట్సప్ గవర్నెన్స్.. చంద్రబాబు 2.0 పనితీరుకు మరో మైలురాయి. సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాదు. ఇప్పటివరకూ ఎవరూ చేయని విధానానికి శ్రీకారం చుట్టాం. 80 శాతం సేవలను సెకన్లలోనే అందిస్తాం. రెండో విడతలో తితిదే దర్శనం టికెట్లను అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ నూతన విధానాన్ని మేం కూడా నేర్చుకునే దశలోనే ఉన్నాం. ప్రభుత్వమే వినియోగదారుడికి ఫోన్ చేసి పరిష్కరించే విధానం తెస్తున్నాం.

**520కి పైగా సేవలు అందించేందుకు కృషి :** భవిష్యత్తులో మరింత మెరుగ్గా 'మన మిత్ర' అమలు చేస్తాం. వచ్చే 6 నెలల్లో గణనీయ మార్పులను ప్రజలే చూస్తారు. మన మిత్ర వాట్సప్ సేవలు.. ప్రజలే బటన్ నొక్కే విధానం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలో ప్రజా సేవలూ వేగంగా అందిస్తాం. 520కి పైగా సేవలు వాట్సప్ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ సేవలన్నీ పూర్తిగా ఉచితం.. బుక్ చేసుకున్నప్పుడే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. రియల్‌టైమ్‌లోనే అన్ని సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల హాల్ టికెట్లు కూడా విద్యార్థులు వాట్సప్ ద్వారా పొందవచ్చు. ఇకపై జారీ చేసే సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ఇస్తాం. సర్టిఫికెట్‌లో తప్పులు ఉన్నా.. తేలిగ్గా పరిష్కరించుకోవచ్చు.

**ఇతర నంబర్లను నమ్మవద్దు..** 95523 00009 నంబర్ ద్వారానే సేవలు అధికారికంగా అందుతాయి. ఇతర నంబర్ల ద్వారా అందిస్తామని ఎవరైనా వస్తే వాటిని నమ్మవద్దు. మరికొన్ని సేవలు అందుబాటులోకి తేవాలంటే చట్ట సవరణలు అవసరం. మలిదశ సేవలకు అనుగుణంగా ప్రభుత్వం చట్టసవరణలు కూడా చేస్తుంది. ఒప్పందం చేసుకున్న 3నెలల్లోనే తొలిదశ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రస్తుతం తెలుగు, ఆంగ్ల భాషల్లో సేవలు అందిస్తున్నాం. రానున్న రోజుల్లో అన్ని భాషల్లోనూ ఉంటాయి. ఈ తరహా సేవలు ప్రపంచంలోనే తొలిసారి అని చెప్పగలం. ఎక్కువ మంది ఒకేసారి వాడకం వల్ల సర్వర్ సమస్యలు తలెత్తవచ్చు. లోడ్‌కి తగ్గట్టుగా సర్వర్ల పెంపు వంటి వాటిని 2 రోజుల్లో పరిష్కరిస్తాం"అని లోకేశ్ తెలిపారు. ఏపీతో పనిచేయడం గర్వంగా ఉందని మెటా ఉపాధ్యక్షురాలు సంధ్య అన్నారు. పీపుల్ ఫ్రెండ్లీగా వాట్సప్ గవర్నెన్స్ రూపొందించామని చెప్పారు. ఈ సేవల కోసం చాలా కృషి చేశామన్నారు.

**వాట్సప్‌తో అందించే సేవలివీ..** తొలి దశలో మొత్తం 161 రకాల పౌర సేవలను ప్రభుత్వం అందించనుంది. రెండో విడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. తొలి విడతలో దేవాదాయ, ఇంధన, ఏపీఎస్‌ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలయ్యాయి. వాట్సప్ సేవలతో ధ్రువపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకనున్నారు. ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని పౌరులకు చేరవేయాలంటే ఈ వాట్సప్ ఖాతా ద్వారా సందేశాలు పంపిస్తుంది. ఒకేసారి కోట్ల మందికి ఈ సమాచారం చేరుతుంది. వరదలు, వర్షాలు, విద్యుత్తు సబ్‌స్టేషన్ల మరమ్మతులు, వైద్యారోగ్య, వ్యవసాయ, అత్యవసర, పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధి సమాచారం వంటివి అందిస్తారు. ప్రజలు వినతులు, ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే.. ఈ వాట్సప్ నంబర్‌కు మెసేజ్ చేస్తే వెంటనే ఒక లింక్ వస్తుంది. అందులో పేరు, ఫోన్ నంబర్, చిరునామా తదితరాలు పొందుపరిచి, వారి వినతిని టైప్ చేయాలి. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ఆధారంగా తమ వినతి పరిష్కారం ఎంత వరకూ వచ్చింది? ఎవరి వద్ద ఉంది అనేది పౌరులు తెలుసుకోవచ్చు. ఎలాంటి సమస్యనైనా ఇక్కడ విన్నవించొచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్హతలు, ఆయా పథకాల ద్వారా కలిగే లబ్ధి తదితర అంశాలన్నింటి గురించి ఈ వాట్సప్ నంబరుకు మెసేజ్ చేసి, తెలుసుకోవచ్చు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సప్‌లో పంపిస్తారు. మీకు కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని.. టికెట్లు, వసతి సహా అన్నీ బుక్ చేసుకోవచ్చు.

**ఈ ధ్రువపత్రాలూ పొందవచ్చు..** ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నో ఎర్నింగ్.. ఇలా వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు వాట్సప్ ద్వారా పొందవచ్చు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్)కి చేసిన దరఖాస్తుల స్టేటస్ తెలుసుకోవచ్చు. విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నుల వంటివి ఈ అధికారిక వాట్సప్ ద్వారా చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్సులు, రెవెన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు పొందవచ్చు. ఏపీఎస్‌ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, జర్నీ రిమైండర్, ట్రాకింగ్ సర్వీసు, సర్వీసు, రిఫండ్, ఫీడ్‌బ్యాక్ తదితర సేవలు దీని ద్వారా పొందవచ్చు.

# అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్టు.. ప్రెస్‌మీట్ మధ్యలో అదుపులోకి తీసుకున్న పోలీసులు!



లఖ్‌నవూ: కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను యూపీ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపుర్ ఎంపీగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలపై కేసు నమోదు కావడంతో అదుపులోకి తీసుకున్నారు. సీతాపుర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయన్ను అరెస్టు చేసినట్లు సమాచారం.  భారీ పోలీసు భద్రత నడుమ ఆయన్ను కోర్టుకు తీసుకెళ్లారు.  తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్స్‌ను సైతం పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపీ రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించినట్లు సమాచారం. అంతకముందు ఇదే కేసులో ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివాసం వద్దకు భారీ బందోబస్తుతో వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జగన్ సీఎం అయ్యాక.. టీడీపీ కార్యకర్తల భరతం పడతాం!: పెద్దిరెడ్డి



రాయచోటి: వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అప్పుడు తెదేపా కార్యకర్తల భరతం పడతామని మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. కడప, రాయచోటిలో వైకాపా సమన్వయ సమావేశానికి హాజరైన పెద్దిరెడ్డి.. తెదేపా కార్యకర్తలను బెదిరించే విధంగా బహిరంగ వ్యాఖ్యలు చేశారు. "వైకాపా నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోంది. సోషల్ మీడియా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామస్థాయిలో కూడా మన కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం అవుతారు. అప్పుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల భరతం పడతాం. వైకాపా కార్యకర్తలపై చేసిన దాడులకు ప్రతి దాడులు కచ్చితంగా ఉంటాయి. మా తడాఖా ఏందో జగన్ సీఎం అయ్యాక వారికి రుచి చూపిస్తాం. ఇక నుంచి కార్యకర్తలకు అండగా ఉంటాం, భరోసా ఇస్తామని జగన్ చెప్పారు. జగన్ ఆదేశాలను అందరూ పాటించాలి. ఎవరికీ భయపడాల్సిన పనిలేదు" అని పెద్దిరెడ్డి అన్నారు.

# వ్హాటే ఇస్టయిల్ జగ్గూభాయ్

ఫ్యామిలీ ఆడియెన్ మెచ్చే హీరోగా జగపతిబాబు కొన్నేళ్ల పాటు టాలీవుడ్‌లో రాణించారు. కథానాయకుడిగా శోభన్ బాబు వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసిన జగపతి కొన్ని వరుస ఫ్లాపుల కారణంగా హీరోయిజాన్ని వదిలి విలన్ పాత్రల వైపు మొగ్గు చూపారు. ఆ సమయంలో అతడి బ్యాడ్ స్క్రిప్ట్ ఎంపికల గురించి చాలా చర్చ సాగింది. అయితే అతడు విలన్ గా, సహాయ నటుడిగా అద్భుతంగా రాణించారు. తన సంచలనాత్మక నిర్ణయంతో అందరిలో స్ఫూర్తిని నింపారు. ఉన్నది ఉన్నట్టు ముక్కు సూటిగా మాట్లాడేందుకు, తన తప్పుల్ని ఒప్పుకునేందుకు జగపతిబాబు ఏనాడూ వెనకాడడు. సూటిగా ఉన్నదున్నట్టు చెప్పడం ఆయన నైజం. ఇటీవల సోషల్ మీడియాల్లోను ఆయన స్పీడ్ గా ఉన్నారు. తాజాగా అతడు



షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. జగ్గూభాయ్ స్టైలిష్ ఫ్యాంట్ ధరించి, బ్లాక్ టీషర్ట్ పై లాంగ్ కోట్ తో ఎంతో స్టైలిష్ గా కనిపించాడు. కళ్లకు ఆ రేబాన్, మెడలో ఎగ్జిక్యూటివ్ బ్యాగ్ తో స్టైల్ అదిరిపోయింది. ఈ ఫోటోగ్రాఫ్ లో అతడు ఎంతో నేచురల్‌గా కనిపిస్తున్నాడు. అంతకుమించి అతడి ఫ్యాషన్ సెన్స్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఇన్ స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోగ్రాఫ్ కి అతడు ఇచ్చిన క్యాప్షన్ కూడా ఆకట్టుకుంది.

బజారుకి పోదాం రండి! అంటూ జగపతి ఫన్నీ కోట్ ని ఇచ్చారు. కెరీర్ మ్యాటర్‌కి వస్తే... జగపతిబాబు ఇటీవల స్టార్ హీరోల సినిమాల్లో సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండ్, శ్రీమంతుడు, నాన్నకు ప్రేమతో, రంగస్థలం, పుష్ప, పుష్ప 2 లాంటి భారీ చిత్రాల్లో అతడు పోషించిన పాత్రలకు మంచి పేరొచ్చింది. ఇటీవల రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ లోను జగపతి బాబు నటించారు.

# క్వీన్ పరిస్థితి కూడా ఆ హీరోలాగే ఉందే!

కిలాడీ అక్షయ్ కుమార్ ఫ్లాప్ ల పరంపర గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఈ మధ్య కాలంలో రిలీజ్ అయిన సినిమాలన్నీ డిజాస్టర్లగానే కనిపిస్తున్నాయి. ఒకదానికొకటి పోటీ పడి మరి ఫెయిలవుతున్నాయి. దీంతో అక్షయ్ కుమార్ కూడా ఒకానొక దశలో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాడు. అయినా ఉత్సాహాన్ని నింపుకుని ముందుకెళ్తున్నాడు. కొత్త ఏడాదిలో నైనా విజయం దక్కకపోతాదా అని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాడు. సరిగ్గా ఇదే పరిస్థితిలో కనిపిస్తుంది క్వీన్ కంగనా రనౌత్ కూడా. బాలీవుడ్ లో అమ్మడి పరిస్థితి కూడా సరిగ్గా లేదు. వరుస వైఫల్యాలతో అమ్మడు ఇబ్బంది పడుతోంది.



దశాబ్ద కాలంలో అమ్మడి కెరీర్ లో సరైన హిట్ ఒక్కటీ లేదు. తను వెడ్స్ మను రిటర్న్ తర్వాత 11 సినిమాలు చేసింది. వాటిలో మణికర్ణిక బిలో యావరేజ్ గా ఆడింది. జాన్సీ రాణి బయోపిక్ కావడంతోనే ఆ మాత్రమైనా బజ్ తో రిలీజ్ అయింది. మిగిలిన చిత్రాల ఫలితాలన్ని షాకింగ్ గానే అనిపిస్తున్నాయి. 'ఐలవ్ ఎన్వై', 'కట్టిబట్టి', 'రంగూన్', 'జడ్జిమెంటల్ హై క్యా','పంగ్', 'తలైవీ','ధాకడ్', 'టికు వెడ్స్ షేర్', 'చంద్రముఖి-2', 'తేజస్', ఇటీవల రిలీజ్ అయిన 'ఎమర్జెన్సీ' ఇవన్నీ ఎలాంటి ఫలితాల సాధించాయో తెలిసిందే. పెట్టుబడి కూడా రికవరీ తేలేని చిత్రాలుగా మిగిలిపోయాయి. అయితే ఈ వైఫల్యాలేవి కంగన ఇమేజ్ ని ప్రభావితం చేయలేదు. వరుస ఫెయిల్యూర్ తర్వాత కంగన నుంచి మరో చిత్రం రిలీజ్ అవుతుందంటే బజ్ ఏమాత్రం తగ్గలేదు. భారీ అంచనాల మధ్య ఆ సినిమా రిలీజ్ అవుతుంది. ఓపెనింగ్స్ భారీగానే వస్తున్నాయి. అలాగే వీటిలో కంగన చేసిన కొన్ని మంచి ప్రయత్నాలున్నాయి. వాస్తవ సంఘటనలు ఆధారంగా కొన్ని, బయోపిక్ లు కొన్ని చేసింది. కనీసం అవైనా సక్సెస్ అయి ఉంటే? కంగన స్టార్ డమ్ కి కలిసొచ్చేది. కంగన బలంగా నమ్మి చేసిన చిత్రాలు కూడా ఊహించని దెబ్బ కొట్టాయి. దీంతో కంగన ఇప్పుడు అంతే వేగంగా బౌన్స్ బ్యాక్ అవ్వాల్సిన అవసరం ఏర్పడింది.




# శివ కార్తికేయన్ పరాశక్తి టీజర్ టాక్..!




శివ కార్తికేయన్, రవి మోహన్, అధర్వ, శ్రీలీల ప్రధాన పాత్రలుగా వస్తున్న సినిమా పరాశక్తి. డాన్ పిక్చర్స్ బ్యానర్ లో ఆకాష్ భాస్కరన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సుధ కొంగర డైరెక్ట్ చేస్తున్నారు. పరాశక్తి కి సంబంధించిన టీజర్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు మేకర్స్. పీరియాడికల్ స్టోరీగా రాబోతున్న ఈ సినిమాలో శివ కార్తికేయన్ ఒక స్టూడెంట్ లీడర్ గా కనిపించనున్నారు. సైన్యమై కదిలిరా అంటూ స్టూడెంట్ లీడర్ గా శివ కార్తికేయన్ చెప్పిన డైలాగ్ అదిరిపోయింది. టీజర్ అంతా కూడా డిఫరెంట్ అప్పీల్ తో ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసేలా ఉంది. శ్రీలీల, అధర్వ ఇద్దరు వెరైటీ లుక్స్ తో కనిపించారు. శివ కార్తికేయ, రవి మోహన్ ఇద్దరి ఫేస్ ఆఫ్ సీన్స్ సినిమాలో హైలెట్ అయ్యేలా ఉన్నాయి. అమరన్ తో సూపర్ హిట్ అందుకున్న శివ కార్తికేయన్ పరాశక్తితో మరో పవర్ ఫుల్ సినిమాతో వస్తున్నాడని చెప్పొచ్చు. సినిమా టీజర్ అయితే ఆకట్టుకోగా సినిమా కూడా ఇదే రేంజ్ లో ఉంటే మాత్రం శివ కార్తికేయన్ ఖాతాలో మరో హిట్ పడినట్టే లెక్క. కథల ఎంపికలో తన మార్క్ చూపిస్తూ ఆడియన్స్ కు ఎలాంటి సినిమాలు చేస్తే మెచ్చుతారో బాగా కనిపెట్టేసిన శివ కార్తికేయన్ కెరీర్ లో ఇప్పుడు సూపర్ ఫాం కొనసాగిస్తున్నాడు. అమరన్ తో కెరీర్ బెస్ట్ హిట్ అందుకుని బాక్సాఫీస్ షేక్ చేసిన శివ కార్తికేయన్ ఈ పరాశక్తితో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి. పరాశక్తి సినిమా టీజర్ ఐతే ఇంప్రెస్ చేసింది. సూరరై పొట్రు తర్వాత సుధ కొంగర చేస్తున్న ఈ సినిమా టీజర్ తోనే అంచనాలు పెంచారు. ముఖ్యంగా రెండు నిమిషాల టీజర్ లోనే కెమెరా వర్క్, కథనం నడిపించిన తీరు ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేశాయి. సుధ కొంగర ఈసారి కూడా మరో అద్భుతమైన కథతో వస్తున్నారని అర్థమవుతుంది. పరాశక్తి టీజర్ శివ కార్తికేయన్ ఫ్యాన్స్ కే కాదు కామన్ ఆడియన్స్ కి నచ్చేసింది. ఐతే టీజర్ లో కథ రివీల్ చేయకపోయినా సినిమా ఏంటన్నది మాత్రం చూపించారు. మరి సుధ కొంగర శివ కార్తికేయన్ కాంబో ఈసారి ఎలాంటి ట్రీట్ అందిస్తుందో చూడాలి.


# హృతిక్ తో తారక్ బ్యాలెన్స్ అతడి చేతుల్లోనే!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ బాలీవుడ్ లో హృతిక్ రోషన్ తో కలిసి ఆయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తోన్న వార్ -2 లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో తారక్ పాత్ర హృతిక్ రోల్ కి ధీటుగా ఉంటుంది. తారక్ రెండు విభిన్న కోణాల్లో కనిపించ నున్నాడనే ప్రచారం ఉంది. హృతిక్ ని ఢీ కొట్టే బలమైన పాత్ర అది తెలుస్తోంది. సినిమాలో అంతిమంగా హీరో హృతిక్ రోషన్ మాత్రమే. కానీ తారక్ ఎలాంటి పాత్రనైనా అవలీలగా పోషించగలడు. అది నెగిటివ్ అయినా...పాజిటివ్ అయినా? జై లవ కుశ సినిమాతో ఆ విషయం ప్రూవ్ అయింది. ఇందులో మూడు పాత్రల్లోనూ తారక్ నటించిన తీరు ఎంతో గొప్పగా ఉంటుంది. మూడు పాత్రలు పోషించింది ఒకే నటుడు కాబట్టి ఎలాంటి తారతమ్యం రాలేదు. అలాగే ఆర్ ఆర్ ఆర్ లో రామ్ చరణ్ తో కలిసి నటించాడు. ఇద్దరి ఇమేజ్..కటౌట్ లుకూడా దాదాపు సమానంగా కావడంతో? బ్యాలెన్స్ అయింది. అయితే వార్ -2లో హృతిక్ తో తారక్ ని బ్యాలెన్స్ చేయడం అన్నది అంత సులభం కాదు. అది పూర్తిగా దర్శకుడి చేతుల్లోనే ఉంది. ఇద్దరి మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలున్నాయంటున్నారు? అయితే అవి ఎంతో బ్యాలెన్సింగ్ గా ఉండాలి. ఆ బ్యాలెన్స్ తప్పితే మాత్రం కామెడీ అయిపోతుందన్నది గుర్తించాలి. ఎందుకంటే హృతిక్ కటౌట్ దగ్గర తారక్ సరితూగలేడు. పెర్ఫార్మెన్స్ పరంగా...డాన్స్ పరంగా ఇబ్బంది లేదు. యాక్షన్ సన్ని వేశాలు...ఛాలెంజింగ్ సన్నివేశాల విషయంలో ఆయాన్ ముఖర్జీ చాకచక్యంగా వ్యవరించాలనే సూచనలు జారీ అవుతున్నాయి. తారక్ ప్రత్యర్ధి ఇమేజ్ లేని నటుడైతే పర్వాలేదు. అక్కడ బ్యాలెన్స్ అవుతుంది. కానీ హృతిక్ లాంటి నటుడితో సీన్స్ అంటే? మరింత జాగ్రత్తగా బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది. ఆయాన్ ముఖర్జీ ఇప్పటికే అగ్ర హీరోలతో సినిమాలు చేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో బ్యాలెన్స్ తప్పదనే అంతా భావిస్తున్నారు.

# జాక్వెలిన్ అందాల వర్కౌట్స్

శ్రీలంక నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ బాలీవుడ్‌లో సెటిల్ అయ్యింది. హిందీలో పలు సినిమాల్లో నటించడంతో పాటు బుల్లితెర కార్యక్రమాల్లోనూ నటించింది. హీరోయిన్ పాత్రలతో పాటు ప్రత్యేక పాటల్లోనూ ఈమె కనిపించడం ద్వారా దేశవ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకుంది. తెలుగులోనూ ఈ అమ్మడు ప్రత్యేక పాటలో కనిపించింది. శ్రీలంకలో టీవీ రిపోర్టర్‌గా చేసిన జాక్వెలిన్ మోడలింగ్ ద్వారా బాలీవుడ్‌లో అడుగు పెట్టింది. మోడలింగ్ చేయడం మొదలు పెట్టిన తక్కువ సమయంలోనే 2006 మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. దాంతో 2006లో మిస్ యూనివర్స్ పోటీల్లోనూ పాల్గొనడం ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. 2009లో సినిమాల్లో అడుగుపెట్టిన ఈ అమ్మడు వెండి తెరపై మెరిసింది. 'అలాదిన్' అనే హిందీ సినిమాలో హీరోయిన్‌గా నటించి మెప్పించింది.



దీంతో వరుసగా హిందీ సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. హౌస్‌ఫుల్ 2తో పాటు ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించడం ద్వారా బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్ జాబితాలో నిలిచింది. అదే సమయంలో సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోల కారణంగా దేశ వ్యాప్తంగా నెటిజన్స్ దృష్టిని ఆకర్షించి పాపులారిటీని సొంతం చేసుకుంది. దాదాపుగా 71 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న జాక్వెలిన్ ఫెర్నాండెజ్ మరోసారి తన అందమైన ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈసారి జాక్వెలిన్ తన వర్కౌట్ ఫోటోలను షేర్ చేసింది. వర్కౌట్ చేస్తూ చాలా కష్టపడుతున్న జాక్వెలిన్‌ని ఈ ఫోటోలో చూడవచ్చు. జాక్వెలిన్ ఇంత అందంగా ఉండటానికి ఇంతగా కష్టపడటం కారణం అని కొందరు కామెంట్ చేస్తున్నారు. వర్కౌట్ చేస్తూ జాక్వెలిన్ ఎంత అందంగా ఉందో చూడండి అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. మొత్తానికి జాక్వెలిన్ వర్కౌట్ ఫోటోలు ఎప్పటిలాగే వైరల్ అవుతున్నాయి. మోడ్రన్ డ్రెస్‌లో, సాంప్రదాయ డ్రెస్‌లోనే కాకుండా ఇలా వర్కౌట్ డ్రెస్‌లోనూ జాక్వెలిన్ అందం చూపు తిప్పనివ్వడం లేదని ఆమె ఫ్యాన్స్, ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రభాస్ హీరోగా నటించిన సాహో సినిమాలో జాక్వెలిన్ బ్యాడ్ బాయ్ పాటలో కనిపించింది. జాక్వెలిన్ ఆ పాటలో ప్రభాస్‌కి పోటీగా డాన్స్ చేయడంతో పాటు, ఆయన పక్కన సరి జోడీగా నిలిచింది. ఇక కన్నడ మూవీ విక్రాంత్ రోనాలోనూ ప్రత్యేక పాటలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం జాక్వెలిన్ చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. వాటిలో రెండు సినిమాలు ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ముఖ్యంగా హౌస్ ఫుల్ 5 సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇటీవలే ఈమె ఫతేహ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే.

# అరెరే కన్ను గీటకలా కొంటె పిల్లా

బాలీవుడ్ లో నటవారసుల హవా కొనసాగుతోంది. నటి శ్వేతా తివారీ వారసురాలు పాలక్ తివారీ ఇంతకుముందే తన మొదటి సినిమాతో అలరించి వరుసగా సినిమాల్లో నటిస్తోంది. ఇటీవల ఈ భామ లవ్ లైఫ్ గురించి ఎక్కువగా మీడియా హెడ్ లైన్స్ లో కొస్తోంది. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో పాలక్ సాన్నిహిత్యం నిరంతరం చర్చగా మారుతోంది. యువజంట స్నేహం షికార్ల గురించి మీడియా కథనాలు అల్లుతోంది. ఆ ఇద్దరి మధ్యా ఏం జరుగుతోందో ఎవరికీ ఇంకా క్లారిటీ లేదు. ఇదిలా ఉంటే, పాలక్ సోషల్ మీడియాల్లో నిరంతర ఫోటోషూట్లను షేర్ చేస్తూ హాట్ టాపిగ్గా మారుతోంది. తాజాగా ఈ బ్యూటీ షేర్



చేసిన ఓ కొంటె ఫోటోగ్రాఫ్ కుర్రకారు గుండెల్ని పిండేస్తోంది. ఇదిగో ఇలా నాజూకు నడుము అందాలను, నాభి సొగసును ప్రదర్శిస్తూ పాలక్ కొంటెగా కన్ను గీటుతోంది. బాటమ్ లో ట్రాక్ సూట్.. ముడి వేసిన వైట్ షర్ట్ కి చేతులు మడతపెట్టి పూర్తిగా రెబల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. పాలక్ అందచందాలు కవ్వించే కొంటెతనం గురించి యూత్ ఎక్కువగా ముచ్చటిస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. పాలక్ తివారీ 2021లో వెబ్ సిరీస్ రోజీ: ది సాఫ్రాన్ చాప్టర్ ద్వారా తన నటనా రంగ ప్రవేశం చేసింది. 2023లో సల్మాన్ ఖాన్ నటించిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ తో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఈ యాక్షన్ కామెడీలో పూజా హెగ్డే కూడా కీలక పాత్రలో నటించింది. ఇటీవల ఇబ్రహీం అలీఖాన్ సరసనా ఈ బ్యూటీ అవకాశం అందుకుందని సమాచారం. ఈ అవకాశం రాక ముందు నుంచే ఆ ఇద్దరి మధ్యా స్నేహం ఉంది.




హైదరాబాద్: గాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద వారు అంజలి ఘటించారు. దేశం, స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన సేవలను వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు




## జీహెచ్ఎంసీ సమావేశంలో రసాభాస.. భారాస కార్పొరేటర్లను సస్పెండ్ చేసిన మేయర్

హైదరాబాద్: జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో రసాభాస నెలకొంది. బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రజా సమస్యలపై చర్చించాలని భారాస పట్టుబట్టింది. ఈక్రమంలో కాంగ్రెస్, భారాస కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో భారాసకు చెందిన నలుగురు కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీన్ని నిరసిస్తూ మిగతా భారాస కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న కార్పొరేటర్లను మళ్లీ తీసుకువచ్చి సభను నిర్వహించాలన్నారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని చెప్పారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.

మేయర్ ప్రజా సమస్యలపై చర్చిద్దామని సర్దిచెప్పినా భారాస కార్పొరేటర్లు పట్టువీడలేదు. ఈక్రమంలో ఆమె అసహనం వ్యక్తంచేస్తూనే మార్షల్స్ తీసుకెళ్లిన కార్పొరేటర్లను తిరిగి సభలోకి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఆ నలుగురు కార్పొరేటర్లు లోనికి రావడానికి నిరాకరించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో భారాస కార్పొరేటర్లందరినీ మేయర్ సస్పెండ్ చేశారు. వారిని మార్షల్స్ బయటికి పంపించగా జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

# నిధులు ఇవ్వట్లేదని అడిగితే బయటకు గెంటేస్తారా?: కేటీఆర్



హైదరాబాద్: జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద భారాస కార్పొరేటర్ల అరెస్టును మాజీమంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. హైదరాబాద్‌ను పట్టించుకోలేదని భారాస కార్పొరేటర్లు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. నిధులు ఇవ్వట్లేదని అడిగితే బయటకు గెంటేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లు, పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. "గత సంవత్సరం కేటాయించిన బడ్జెట్ నిధులను కనీసం ఖర్చు చేయకుండా, మరోసారి అవే కాగితాలపై అంకెలు మార్చి కాంగ్రెస్ గొప్పలు చెబుతోంది. దీన్ని అడ్డుకున్నందుకు మా ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస సౌకర్యాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే ఈ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోంది. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తిచేయాలి. అప్పటివరకు ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పురపాలక శాఖకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రిని నిలదీస్తూనే ఉంటాం" అని కేటీఆర్ తెలిపారు.

**చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించడం అప్రజాస్వామికం: హరీశ్‌రావు...** భారాస కార్పొరేటర్ల అరెస్టులను మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేస్తున్న వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ మీద ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదిస్తున్నట్లు ప్రకటించడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అధిష్ఠానానికి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన.. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్ఠానం వద్దకు పంపించామని తెలిపారు.

## తెలంగాణలో ఇంటర్ హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులు

హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్ హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులు నెలకొన్నాయి. సీజీజీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యతో ఈ అంతరాయం ఏర్పడింది. దీంతో హాల్‌టికెట్ లేకున్నా విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లించిన, చెల్లించని వారి జాబితాలు సిద్ధం చేయాలని చెప్పింది. హాల్‌టికెట్ రాని వారి జాబితా సిద్ధం చేయాలని సిబ్బందిని బోర్డు ఆదేశించింది.






## ఘోర ప్రమాదం.. ఢీకొని నదిలో కూలిన విమానం, హెలికాప్టర్

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 64 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం.. మరో హెలికాప్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆ రెండూ పక్కనే ఉన్న పోటోమాక్ నదిలో కూలిపోయాయి. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరింది. వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. గగనతలంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో భారీ శబ్దం వినిపించింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని.. స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ఘటన సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. ఇక, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని, వీఐపీలు ఎవరూ లేరని రక్షణ శాఖ అధకారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల కోసం నదిలో గాలింపు కొనసాగుతోంది. ఇప్పటివరకు ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్'లో స్పందించారు. ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.




## హెలికాప్టర్.. విమానం దిశగానే ఎందుకెళ్లింది?: ట్రంప్ అసహనం

అమెరికాలోని వాషింగ్టన్ సమీపంలో ప్రయాణికుల విమానం, హెలికాప్టర్ ఢీకొని ఆ రెండూ నదిలో కూలిపోయిన సంగతి తెలిసిందే. విమానం ముక్కలై నదిలో పడిపోగా.. హెలికాప్టర్ కూడా తలకిందులుగా కూలింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "విమానాశ్రయానికి వెళ్లే దారిలో విమానం సరైన దిశలో ఉంది. కానీ హెలికాప్టర్ చాలాసేపు నేరుగా విమానం వైపు వెళ్లింది. ఆకాశం నిర్మలంగా ఉంది. విమానం లైట్లన్నీ వెలుగుతున్నాయి. కానీ హెలికాప్టర్ కిందికో, మీదికో, పక్కకో ఎందుకు వెళ్లలేదు. విమానాన్ని చూశారా అని అడిగే బదులు ఏం చేయాలో కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది ఎందుకు చెప్పలేదు. ఇది పూర్తిగా నివారించదగ్గ ప్రమాదం. ఇలా జరగడం ఏమాత్రం సరిగా లేదు" అని ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. విమానం ల్యాండింగ్‌కు ఏటీసీ క్లియరెన్స్ ఇవ్వగా.. సరిగ్గా అదే సమయానికి ఓ మిలిటరీ హెలికాప్టర్ ఆ మార్గంలోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్.. హెలికాప్టర్‌కు సమాచారమిచ్చారు. 'మీ ముందు విమానం వస్తోంది కన్పిస్తుందా?' అని అడిగారు.

కొన్ని క్షణాల్లోనే మరో రేడియో కాల్‌ను పంపించారు. ఆ తర్వాత కేవలం 30 సెకన్లలోపే ఆ రెండూ ఢీకొన్నట్లు శబ్దం వినిపించింది. ఆ సమయంలో రెండింటిలో కలిపి 67 మంది ఉన్నారు. ఇప్పటివరకు నది నుంచి 18 మృతదేహాలను వెలికితీశారు.

# రాష్ట్ర విద్యుత్ సామర్థ్యం పెంపులో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు



హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచనలతో రాష్ట్ర అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఆన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా.. తెలంగాణ విద్యుత్‌శాఖ అధికారుల బృందం ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసి.. 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. హిమాచల్ సీఎం సుఖ్విందర్‌సింగ్ సఖుతో గురువారం దిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 400 మెగావాట్ల సెలీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన ముసాయిదాను పంపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హిమాచల్ ప్రదేశ్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం తగిన పరిశీలన చేసి త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా చర్యలు చేపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. భుజంగరావు, రాధా కిషన్‌రావుకు బెయిల్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుకు బెయిల్ మంజూరైంది. తెలంగాణ హైకోర్టు వీరికి బెయిల్ మంజూరు చేసింది.
రూ.లక్ష చొప్పున 2 ష్యూరిటీలు, పాస్‌పోర్టులు సమర్పించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని హైకోర్టు వారికి స్పష్టం చేసింది.



# ఓడిపోతారని పసిగట్టి.. కేజ్రీవాల్ చిల్లర రాజకీయాలు: అమిత్ షా

దిల్లీ: వచ్చే నెల 5న జరగనున్న దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకే ఆప్ అధినేత కేజ్రీవాల్ యమునా నదిలో భాజపా విషం కలిపిందని ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. ఈ మేరకు ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఆప్ పాలనలో యమునా నది కలుషితమైపోయిందని.. దిల్లీ ప్రజలతో మురికి నీటిని తాగిస్తోందని విమర్శించారు. దిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కేజ్రీవాల్ గ్రహించారని.. అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. దిల్లీలో ఆప్ పాలనను తరిమికొట్టేందుకు ఫిబ్రవరి 5 అనేది ఒక అవకాశమని పేర్కొన్న ఆయన.. ఆ రోజు భాజపాకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. భాజపా అధికారంలోకి వస్తే దిల్లీని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మరోవైపు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిల్లీ కంటోన్మెంట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను అమలు చేసే ఏకైక పార్టీ భాజపా మాత్రమేనన్నారు. దిల్లీలో ఈసారి భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com